ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం · కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | Friday 25 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 162 | Vol.No 28 Issue No .162 | www.visionandhra.in

# 2030 నాటికి పేదరిక నిర్మూలన..

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు వేగం పెంచే దిశగా కీలక నిర్ణయాలు
- TSDPS బలోపేతం.. ప్రత్యేక PMU ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌కు రూపకల్పన
- ప్రభుత్వం GFST భాగస్వామ్యానికి ప్రతిపాదన



హైదరాబాద్: తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శులతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన GFST వైస్ చైర్మన్ ఎస్.పీ. టక్కర్‌తో పాటు GFST ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

### TSDPSకు ప్రత్యేక PMU

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (TSDPS)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (PMU) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను సమీక్ష నిర్వహించనుంది.

మిగతా 2లో..



# పంటలు ఎండనివ్వం.. వారాబందీతోనే నీటి నిర్వహణ

- కర్ణాటక నుంచి జూరాలకు కృష్ణా జలాలు
- వనపర్తి కలెక్టరేట్‌లో మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి ఉన్నత స్థాయి సమీక్ష

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : ఎల్ నీనో ప్రభావంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వానకాలం పంటలను ఎలాగైనా కాపాడుకోవాలనే ధృడ సంకల్పంతో ప్రభుత్వం ఉందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి కృష్ణా నది సాగు, తాగునీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులు, జిల్లా యంత్రాంగంతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

*పొదుపుగా వాడుకుంటేనే పంటలు దక్కుతాయి :మంత్రి జూపల్లి కృష్ణారావు*

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానకాలం పంటలు, తాగునీటికి కలిపి మొత్తం 18.19

మిగతా 3లో..

# రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు సీఎం ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు



హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ - 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు

మిగతా 2లో..

### ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా

# కేంద్ర నిర్ణయం

- రైతులను ఆయిల్ పామ్ వైపు ప్రోత్సహిస్తూ.. అదే రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధానాలు ఎందుకు?
- దిగుమతి సుంకం తగ్గింపుతో దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధరలపై ఒత్తిడి పడే అవకాశం
- రాష్ట్రం 44 శాతం దిగుమతి సుంకం కోరుతుంటే.. కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించింది
- కేంద్ర నిర్ణయం ఆయిల్ పామ్ రైతుల్లో అనిశ్చితిని పెంచే అవకాశం
- దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే పునరాలోచించాలి
- రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్ర దిగుమతి సుంకం తగ్గింపు ప్రతికూలంగా మారే అవకాశం

మిగతా 2లో..



### ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

- అన్ని హెల్త్ ఫెసిలిటీస్‌లో ఫైర్ సేఫ్టీ ఆడిట్‌పై అధికారులతో చర్చ
- హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలు, లోపాల గుర్తింపు, సరిదిద్దే చర్యలపై సమీక్ష




హైదరాబాద్ : ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం సమీక్షించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని,

మిగతా 2లో..

### ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సవరణపై

# సందేహాలు నివృత్తి చేయాలి

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్24:(విజన్ ఆంధ్ర ) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహణలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగిస్తోందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ

మిగతా 2లో..

### మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని హరీశ్ రావు విమర్శ

మిగతా 2లో..



### 'ఎన్నికలకు సిద్ధం అవుతా'.. సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

- సుప్రీం తీర్పును గౌరవిస్తున్నానన్న దానం
- న్యాయపోరాటం చట్టపరంగానే చేశానని వెల్లడి
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమని ప్రకటన
- ప్రజల ఆశీర్వాదం కోరతానన్న దానం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం



హైదరాబాద్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే

మిగతా 2లో..




# జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి

### - రాహుల్ గాంధీ డిమాండ్

- మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ
- సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అప్రూవర్‌గా మారాలని డిమాండ్
- ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టీకరణ

ఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఒక "దేశద్రోహి" అని, ఆయన దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్

మిగతా 2లో..

# 22ఏ భూములపై కీలక నిర్ణయం.. రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- 22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన ప్రభుత్వ తాజా ఆదేశాలు
- వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట
- అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీ




హైదరాబాద్: రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో

మిగతా 2లో..

# రాష్ట్రంలో రేపు కూడా వర్షాలు.. జలాశయాలు నింపండి

### - సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- రాష్ట్రంలో రేపు కూడా వర్షాలు కొనసాగుతాయని అంచనాల నడుమ సీఎం చంద్రబాబు సమీక్ష
- భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం
- ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన
- వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, క్రీడలు, విద్యుత్ సరఫరాపైనా కీలక ఆదేశాలు జారీ

అమరావతి : రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను

మిగతా 2లో..




### వర్షాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టేవరకు

# అప్రమత్తంగా వ్యవహరించండి

- లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి
- వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- రోడ్లపై కూలిన చెట్లను తక్షణం తొలగించి రాకపోకలు పునరుద్ధరించండి
- నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు డీ వాటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలి
- తక్షణం పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి
- ఆస్తి నష్టం జరిగిన చోట తక్షణం పరిహారం అందించే ఏర్పాట్లు చేయండి
- పిఠాపురం నియోజకవర్గంలో సుద్ధగడ్డ వాగు ముంపుపై ఆరా
- ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులు అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

కాకినాడ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిపై కలెక్టర్‌తో సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



కాకినాడ : తీవ్ర వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కాకినాడ జిల్లావ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండడంతో యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని

మిగతా 2లో..

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## 'ఎన్నికలకు సిద్ధం అవుతా'.. సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

## రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం

ఎంపిక చేసినట్టు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మాజీ ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతి పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేదికలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్ గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపుపొందారు.

## 22ఏ భూములపై కీలక నిర్ణయం.. రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

చేసినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించింది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్లలో ఫైర్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష

ఫైర్ సేఫ్టీ ఆడిటింగ్ కూడా రెగ్యులర్‌గా చేపిస్తున్నామని మంత్రికి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఇప్పటికే నిర్వహించిన ఫైర్ ఆడిట్లలో గుర్తించిన అంశాలు, తీసుకున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. ఫైర్ సేఫ్టీ లోపాలు ఉన్న చోట తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హెల్త్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ, తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సవరణపై
# సందేహాలు నివృత్తి చేయాలి

అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రధాన పునాది అని, ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కును పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందని పేర్కొన్నారు. గత పది నెలలుగా ఓటర్ల జాబితా సవరణ అంశాలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు తెలిపారన్న వార్తలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటాబేస్ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ మార్పులతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు పూరించే ఫారం-6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై కూడా కమిషనర్లు అభ్యంతరం తెలిపినట్లు వెల్లడైందని, కాబట్టి ఈ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటో ఎన్నికల సంఘం ప్రజలకు వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానంపై క్షేత్రస్థాయి అధికారులైన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల పర్యవేక్షణ బాధ్యత ఏమిటో తేల్చాలని, సమాచారాన్ని ఎవరు, ఎప్పుడు, ఏ అధికారి అనుమతితో మార్చారనే వివరాలపై స్పష్టమైన ఆడిట్ ట్రయల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సవరణ ప్రక్రియలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని, ఏ ప్రాతిపదికన ఎంతమంది పేర్లు తొలగించారు, ఎన్ని అభ్యంతరాలు వచ్చాయి, మళ్లీ ఎన్ని పేర్లు చేర్చారనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా బహిర్గతం చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఏ ఒక్కరి ప్రయోజనాల కోసం పనిచేయకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ఒక్క అర్హత ఉన్న ఓటరు పేరు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న సందేహాలకే ఇద్దరు కమిషనర్లు తెలిపిన అభ్యంతరాలు బలం చేకూరుస్తున్నాయని, కేంద్రంలోని అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఉన్న ఈ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోరాటానికి ప్రజాస్వామ్యవాదులంతా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## వర్షాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టేవరకు అప్రమత్తంగా వ్యవహరించండి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వరద ముంపు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అవసరం అయితే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కాకినాడ జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా సమీక్షించారు. రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి వ్యవస్థ, పంట నష్టం, మత్స్యకారుల భద్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలగా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో తక్షణం తొలగించామని, ప్రాథమిక అంచనాల మేరకు జిల్లావ్యాప్తంగా 1,885 హెక్టార్లలో పంట దెబ్బతిందని కాకినాడ కలెక్టర్ హరేందర్ ప్రసాద్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి శాఖల వారీగా పరిస్థితిని 24 గంటలు సమీక్షిస్తున్నట్టు, ప్రస్తుతం పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వరద ముంపు, సహాయక చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంకా భారీ వర్షాలు కురుస్తుండడంతోపాటు ఆకస్మిక వరద ముప్పు పొంచి ఉన్న హెచ్చరికలు ఉండడం వల్ల లోతట్టు ప్రాంతాలు, ముంపు పొంచి ఉన్న గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణకు అంతరాయం లేకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా పంపుల వినియోగించి ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని, ఈదురు గాలుల కారణంగా రహదారులపై కూలిన చెట్లను తక్షణం తొలగించి రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

జిల్లా పరిధిలోనే ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతులకి తక్షణం సహాయం అందేలా చూడాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితిని ఉప ముఖ్యమంత్రివర్యులు అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు అమలు చేయాలన్నారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రివర్యులు కోరారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జిల్లా యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## ఆయిల్ పామ్ రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర నిర్ణయం

ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, రైతులను ఈ పంట వైపు మళ్లించాలని రాష్ట్రాలకు సూచిస్తూ.. మరోవైపు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు. "రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తారు.. కానీ రైతు పండించిన గెలలకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులను మాత్రం కేంద్రం దెబ్బతీస్తోంది. ఒక చేత్తో రైతును ఆయిల్ పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో దిగుమతి సుంకం తగ్గించి విదేశీ పామాయిల్‌కు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానం?" అని మంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది. దీంతో దిగుమతి చేసుకునే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. "తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయం. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో విదేశీ దిగుమతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా కేంద్రం ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటోంది?" అని తుమ్మల ప్రశ్నించారు. ఆయిల్ పామ్ అనేది సాధారణంగా ఒక సీజన్‌లో పండించి విక్రయించే పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై విధానపరమైన స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. "ఈరోజు మొక్క నాటిన రైతు రేపే పంట అమ్మడు. సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత మార్కెట్ విధానాలను మార్చేస్తే నష్టపోయేది రైతే. రైతుకు ధర భరోసా ఇవ్వకుండా, దిగుమతులకు తలుపులు మరింత విస్తరించడం రైతు ప్రయోజనాలకు విరుద్ధం" అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. రైతులను ఆయిల్ పామ్ వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీలు, నాట్ల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీలు వంటి అనేక చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా చీవీజూ-ూూ ద్వారా దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రకటించింది. "కేంద్రం ప్రకటించే లక్ష్యాలు ఒకలా.. అమలు చేసే విధానాలు మరోలా ఉంటే రైతు ఎలా నమ్మకం పెంచుకుంటాడు? ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం రాష్ట్రాలు, రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత దిగుమతి సుంకం వంటి కీలక విధానాలను మార్చడం వల్ల రైతుల్లో నమ్మకం దెబ్బతింటుంది" అని తుమ్మల అన్నారు. ఆయిల్ పామ్ రైతుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన తాజా ఆయిల్ పామ్ గెలలకు (FFB) టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో FFB ధర ప్రభుత్వం నిర్ణయించే విధానం ప్రకారం అమలవుతోందని, రైతులకు మరింత స్థిరమైన ధర భరోసా అవసరమని పేర్కొన్నారు. "రైతు ఆదాయం పెంచుతామని చెప్పే కేంద్ర ప్రభుత్వం ముందుగా రైతు పండించిన పంటకు ధర భరోసా కల్పించాలి. విదేశీ దిగుమతులపై ఆధారపడే విధానాన్ని ప్రోత్సహిస్తూ దేశీయ రైతు ఉత్పత్తికి ధర లేకుండా చేయడం ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికే విరుద్ధం" అని మంత్రి అన్నారు. భారత్ తన వంట నూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయడం కేవలం రైతు సంక్షేమానికే కాకుండా దేశ ఆహార, వ్యవసాయ భద్రతకు కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ తన వెజిటబుల్ ఆయిల్ అవసరాల్లో సుమారు మూడింట రెండొంతులు దిగుమతులపై ఆధారపడుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. "ఆత్మనిర్భర్ భారత్ అంటే విదేశీ దిగుమతులపై ఆధారపడటం కాదు.. దేశ రైతు ఉత్పత్తి చేసే నూనెను పెంచడం. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా దేశం ఆత్మనిర్భర్ కాదు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది" అని తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం సహకరించాల్సింది పోయి, రైతుల్లో అనిశ్చితి కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. "తెలంగాణ రైతులు నమ్మకంతో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చారు. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రాజీ పడదు. కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు ధర భరోసా కల్పించేలా కేంద్రం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, లేని పక్షంలో ఖీఖీదీలకు టన్నుకు రూ.25,000 కనీస హామీ ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి

చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం' (vote chori) జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (Special Intensive Revision ` SIR) సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అబ్‌కీ బార్ 400 పార్" అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. "1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?" అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం 'ఓట్ల దొంగతనం' జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. "ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని 'చట్టాల దొంగతనం' అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి" అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, "మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి" అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

## రాష్ట్రంలో రేపు కూడా వర్షాలు.. జలాశయాలు నింపండి

సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు.

ప్రధాన నదులకు వరద హెచ్చరికలు

గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత వర్షాలకు గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి, భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం నాటికి మొదటి, సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని వివరించారు.

ఎల్‌నినోపై వ్యూహం.. సాంకేతికత వినియోగం

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూసారాన్ని పెంచడం, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాలను ప్రోత్సహించాలని చంద్రబాబు అన్నారు. దీనిని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే కార్యక్రమం కూడా అదే రోజు ప్రారంభిస్తామని తెలిపారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా అమెరికాలో ఉంటున్న పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్‌ను సీఎం పరిశీలించి, అతడిని అభినందించారు. ఈ సమీక్షలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యుత్ సరఫరా నాణ్యత పెంచాలని, ఇసుక సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు శాప్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడా క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల్లో అధికారుల పనితీరు మెరుగుపరిచేందుకు నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

# 2030 నాటికి పేదరిక నిర్మూలన..

### 2030 నాటికి 'జీరో పావర్టీ'

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ

తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

### రంగాల వారీ నిపుణుల సేవలు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు.

### ప్రభుత్వం GFST భాగస్వామ్యం

వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు తెలంగాణ ప్రభుత్వం GFST మధ్య అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేయాలని నిర్ణయించారు.

### జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (KPIs), కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైన చోట సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రోత్ ల్యాబ్స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులులాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపదఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది.

### ఫలితాల ఆధారంగా అభివృద్ధి

TSDPSPMU బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వం GFST భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో స్పష్టం చేశారు. సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రియాంకే ఎక్కువ క్రౌడ్ పుల్లరా

కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరుగుతోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థానానికే పరిమితమవుతుండగా.. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను ప్రియాంక భుజాలకెత్తేలా రోల్ డివిజన్ జరుగుతోందిరాష్ట్రాల ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ప్రచార శైలికి వస్తున్న ప్రజా స్పందన, ఆమె సక్సెస్ రేట్. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో బిజీగా ఉన్నప్పుడు సైతం ప్రియాంక నేతృత్వంలో సాగిన దూకుడు ప్రచారం కాంగ్రెస్‌కు అద్భుత ఫలితాలనిచ్చింది. ముఖ్యంగా ఆమె ప్రసంగించే తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం, తన నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుకు తెచ్చే హావభావాలు ఉత్తర, మధ్య భారత ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటాయి. స్థానిక నేతల మధ్య ఉండే గ్రూపు తగాదాలను చక్కదిద్దడంలోనూ, మహిళా ఓటర్లను ప్రభావితం చేయడంలోనూ ప్రియాంక అనుసరించే శైలి రాహుల్ కంటే చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది.కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరగబోతున్నట్లు తెలుస్తోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.కానీ

"రాహుల్‌ను అసెంబ్లీ ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించి, ప్రియాంకకు అప్పగిస్తున్నారు" అని చెప్పడానికి ప్రస్తుతం పరిస్థితులు సరిపోవు.మోదీ వర్సెస్ రాహుల్ గా మార్చి రాష్ట్ర స్థాయి ఎన్నికలను సైతం జాతీయీకరణ చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. అయితే, ప్రియాంక రంగంలోకి దిగితే ఆ సమీకరణం మారుతుంది. ఆమె స్థానిక సమస్యలు, ధరల పెరుగుదల, మహిళా సంక్షేమం, నిరుద్యోగం వంటి అంశాల చుట్టూనే ప్రచారాన్ని నడిపిస్తూ బీజేపీపై ఎదురుదాడి చేస్తారు. దీనివల్ల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.ఈ అంశంలో కొన్ని సవాళ్లు లేకపోలేదు. ప్రియాంక ఇమేజ్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. స్థానిక బలమైన నాయకత్వం, గ్రౌండ్ లెవల్ బూత్ మేనేజ్‌మెంట్ లేకపోతే కేవలం వ్యక్తుల చరిష్మాతోనే ఎన్నికలను గెలవలేమని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపితమయింది. కాంగ్రెస్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తూ, ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రచారాన్ని నడిపిస్తారని కొత్త రాష్ట్ర ఇన్‌చార్జి సచిన్ పైలట్ స్పష్టంగా చెప్పారు.ఉత్తరాఖండ్‌లో కూడా కాంగ్రెస్



ప్రణాళికలో ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముగ్గురూ ప్రచారంలో పాల్గొనడం కనిపిస్తోంది. అంటే ఇప్పటి వరకు "రాహుల్‌కు అసెంబ్లీ ఎన్నికల నుంచి పూర్తిగా విముక్తి" అనే సూచనలు కనిపించడం లేదు.అవును. దీనికి ఒక ముఖ్యమైన ఉదాహరణ 2026 అసోం ఎన్నికల సమయంలో కనిపించింది. కాంగ్రెస్ ప్రియాంక గాంధీని అస్సాం చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ కమిటీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది.అంటే ప్రియాంక పాత్ర కేవలం సభల్లో ప్రచారం చేయడం వరకు కాకుండా టికెట్ల ఎంపిక, రాష్ట్ర స్థాయి ఎన్నికల వ్యూహం, సంస్థాగత సమన్వయం వంటి అంశాల వైపు కూడా విస్తరిస్తున్న సంకేతాలు ఉన్నాయి.అయితే ఇదే సమయంలో ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం ఉంది. 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణను పరిశీలించిన పార్టీ రాహుల్ గాంధీ బృందానికే జఖ ప్రచార బాధ్యతను ఎక్కువగా అప్పగించే దిశలో ఉందని పార్టీ వర్గాలను ఉటంకించింది.ఆగస్టులో జరిగిన యూపీ కాంగ్రెస్ సమావేశానికి రాహుల్, ఖర్గే హాజరైనా, ప్రియాంక హాజరు కాలేదని కూడా ఆ కథనం పేర్కొంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్నది , కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక సంజీవనిలా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రయోగించి అసెంబ్లీ పోరుల్లో బీజేపీని నిలువరించాలని అధిష్ఠానం గట్టి పట్టుదలతో ఉంది. రాహుల్-ప్రియాంకల ఈ సరికొత్త పవర్ షేరింగ్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాల స్థాయిలో ఎంతవరకు పునరుజ్జీవాన్ని తెస్తుందో రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# పంటలు ఎండనివ్వం.. వారాబందీతోనే నీటి నిర్వహణ

టీఎంసీల నీరు అవసరమని మంత్రి తెలిపారు. ప్రస్తుతం జూరాలలో ఉన్న 7 టీఎంసీల నీటితో పాటు కర్ణాటక నుంచి విడుదలవుతున్న జలాలను అత్యంత జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నవంబర్ 27 వరకు వారాబందీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతిలో డిస్ట్రిబ్యూటరీ వారీగా సమానంగా నీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

లష్కర్లు, సిబ్బందిని ఉపయోగించుకుని నీటి సరఫరాను క్రమబద్ధీకరించాలి. వ్యవసాయ విస్తీర్ణాధికారుల ద్వారా రైతులకు వారాబందీపై అవగాహన కల్పించాలి. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌లో జమ్ము, సిల్టింగ్ తొలగింపునకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. సీఎం ఎ. రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని కర్ణాటక ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో మాట్లాడటం, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల బృందం అక్కడకి వెళ్లడంతోనే జూరాలకు నీటి విడుదల సాధ్యమైందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు.

**అధికారుల నడుమ సమన్వయం ముఖ్యం :మంత్రి వాకిటి శ్రీహరి**

ప్రజా ప్రభుత్వం సాగునీటి రంగానికి, రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి వివరాలను ప్రతిరోజూ మీడియాకు వెల్లడించి, రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమాచార లోపం లేకుండా చూడాలి.నీటి విడుదల, నిర్వహణ నిర్ణయాలను వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి. క్లిష్ట సమయంలో నీటిని విడుదల చేసిన కర్ణాటక ప్రభుత్వానికి జిల్లా రైతాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు.

**త్వరలోనే ఆర్డీఎస్‌కు తుంగభద్ర జలాలు :ఎంపీ మల్లు రవి**

కృష్ణా జలాలను కర్ణాటక నుంచి సాధించుకున్నట్లే, త్వరలోనే తుంగభద్ర జలాలను ఆర్డీఎస్‌కు విడుదల చేయించేలా కృషి చేస్తామని ఎంపీ మల్లు రవి తెలిపారు. నీటి సరఫరాపై రైతుల్లో ఉన్న అపోహలను తొలగించి వాస్తవ పరిస్థితులను వివరించాలని అధికారులకు సూచించారు.

**ఎకరం పంట కూడా ఎండనివ్వం: ఎమ్మెల్యేలు**

ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకూడదనే లక్ష్యంతో కర్ణాటక వెళ్లి నీటిని విడుదల చేయించామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కోయిల్ సాగర్‌ను నింపడానికి వెంటనే రెండు మోటార్లు ఆన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, వనపర్తి, గద్వాల ఎస్పీలు సునీత రెడ్డి, శ్రీనివాసరావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నీటిపారుదల శాఖ సీఈ రహీముద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రతినిధి సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (CHCs), సబ్‌సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పి.హెచ్.సి లు, సి.హెచ్.సిల వైద్యాధికారులు, జిల్లా టిబి, కుష్టు, ఎన్.సి.డి,ఎమ్ హెచ్ ఎన్ , ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని పి.హెచ్.సిలు, సి.హెచ్.సి లు, సబ్‌సెంటర్లలో మందుల లభ్యత, సిబ్బంది నిర్వహణ, మండల స్థాయి ఆరోగ్య సిబ్బంది (MLHPs), నర్సింగ్ సిబ్బంది విధుల కేటాయింపు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకం, స్వీపర్లు, ఇతర కంటింజెన్సీ సిబ్బంది నియామకం వంటి అంశాలను సమీక్షించారు. పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మందుల కొరతపై ప్రత్యేకంగా సమీక్షించిన కలెక్టర్, అవసరమైన మందులకు ముందుగానే ఇండెంట్‌లు సమర్పించాలని, సరఫరాలో జాప్యం జరిగితే వివరాలను నమోదు చేసి నివేదించాలని ఆదేశించారు. ప్రతి నెల 15, 30 తేదీల్లో మందుల ఇండెంట్‌లు, సరఫరా పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న మందుల వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయాలపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. పి.హెచ్.సిల్లో రోగుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది విధులను పునర్వ్యవస్థీకరించాశీలని కలెక్టర్ సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోగుల రద్దీని పరిశీలించి, అవసరానికి అనుగుణంగా సిబ్బంది షిఫ్టులను రూపొందించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్నట్లు భావించిన చోట ముందుగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, నిజమైన కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సబ్‌సెంటర్లలో MLHP\T



నిర్దేశిత రోజుల్లో విధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొదటి, మూడవ వారాల్లో గురువారాలను ప్రత్యేక సమీక్ష/ఫీల్డ్ కార్యక్రమాలకు కేటాయించి, మిగిలిన రోజుల్లో సబ్‌సెంటర్లలో సేవలు అందించేలా విధి నిర్వహణను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రతి పి.హెచ్.సి వైద్యాధికారి తన పరిధిలోని సబ్‌సెంటర్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌సెంటర్ల పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సబ్‌సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ఫాగింగ్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (NCD) స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలి అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలకు గ్రామాల వారీగా, ఆశా వారీగా లక్ష్యాలను నిర్దేశించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు తదితర చీజణలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూడాలన్నారు. స్క్రీనింగ్‌లో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా న్యూం టీకా కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన బాలికలకు న్యూం టీకాపై అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. =దీూఖ ద్వారా చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించారు. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (HMIS)లో ఎదీ కేసుల నమోదు, చిన్నారుల టీకా కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య స్క్రీనింగ్, వీఎచీ కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను కలెక్టర్ పీహెచ్‌సీ వారీగా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, కుష్ఠు (లెప్రసీ), ఎదీ కేసుల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల పురోగతి, సబ్‌సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతుల పనుల పరిస్థితిపై కూడా సమీక్షించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రతి వైద్యాధికారి బాధ్యతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా వైద్యాధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి, పి.హెచ్.సి లు, సి.హెచ్.సిల వైద్యాధికారులు, ప్రాజెక్టు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీతో ఢీ..తప్పదా

విజయవాడ, సెప్టెంబర్ 24,: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎంతో పట్టుదలతో ఉన్నారు. కాకినాడలో నిర్వహించిన జనసేన రాష్ట్రస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో




పవన్‌కల్యాణ్ కీలక కామెంట్స్ చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే పార్టీ ఎక్కడెక్కడ బలంగా వుందో గుర్తించేందుకు కమిటీలను వేసిన సంగతి తెలిసిందే. ఆ కమిటీలు ప్రస్తుతం ఆ పనిపై బిజీగా వున్నాయి.ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పవన్ దిశానిర్దేశంపై కీలక అంశాలు బయటికి వస్తున్నాయి. టీడీపీ అనుకూల మీడియా పవన్ కామెంట్స్‌ను తమ పార్టీకి అనుకూలంగా రాసుకొచ్చాయి. ఆత్మాభిమానం తగ్గని రీతిలో జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు. అవసరమైతే మిత్ర ధర్మం పాటిస్తూనే, పార్టీ బలంగా వుందని కార్యకర్తలు నమ్మిన చోట పోటీకి దిగుతామనే పవన్ అభిప్రాయాన్ని అర్థం చేసుకునే వాళ్లకు కావాల్సిన అర్థం వుంది.జనసేన సోషల్ మీడియాలో ప్రధానంగా కాకినాడలో పవన్ దిశానిర్దేశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. స్థానిక సంస్థల్లో బలం ఉన్న చోటే పోటీ అనే ప్రచారంపై పవన్ చాలా స్పష్టంగా తేల్చి చెప్పారనేది ఆ ప్రచార సారాంశం. పొత్తులో ఉన్నామనే కారణంతో, టీడీపీ చెబుతున్న ప్రకారం 15 శాతం సీట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రశ్నే లేదని పవన్ తేల్చి చెప్పారని అంటున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల విషయంలో టీడీపీ ప్రతిపాదనలపై అంగీకారం లేకపోతే, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రశ్నే లేదని పవన్ తేల్చి చెప్పినట్టు జనసేన సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. జనసేన బలంగా ఉన్న చోట టీడీపీ టికెట్లు కోరితే, ఇచ్చేందుకు సిద్ధంగా లేమని పవన్ స్పష్టం చేశారు. టీడీపీ వెనక్కి తగ్గకపోతే, ఆ పార్టీతో పోటీకి సిద్ధంగా వుండాలని తన పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్టు జనసేన సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. ఈ ఎన్నికలు మున్ముందుకీ జనసేన బలోపేతానికే అని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారని సమాచారం.పవన్‌కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం? చాలా చోట్ల టీడీపీతో ఫ్రెండ్లీ పోటీ తప్పేలా లేదు. ఎందుకంటే, జనసేన నాయకత్వాన్ని బలపరిచేందుకు టీడీపీ సిద్ధంగా లేదు. స్థానిక సంస్థల్లో జనసేన బలపడితే, సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు డిమాండ్ చేస్తుందనే భయం టీడీపీని వెంటాడుతోంది. అందుకే క్షేత్రస్థాయిలో జనసేన బలం నామమాత్రం అని చూపడానికైనా, స్థానిక సంస్థల ఎన్నికల్లో తక్కువ సీట్లు ఇవ్వడానికే టీడీపీ ప్రాధాన్యం ఇస్తుంది. అయితే తగ్గేదే లే అనే మాటపై పవన్ నిలబడతారా? అనేదే ఇప్పుడు ప్రశ్న.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు

## - నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి గ్రామ పంచాయతీల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడే వర్షాభావం, నీటి కొరతను ముందుగానే అంచనా వేసి, వాటిని ఎదుర్కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. వి.బి.జి. రామ్‌జీ పనుల కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై సర్పంచులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రణాళికలను ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం పనులను అమలు చేయాలని తెలిపారు.

***నీటి భద్రతకు ప్రాధాన్యం***

వర్షపాతం అస్థిరత, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలపై ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్లు వంటి నీటి సంరక్షణ పనులను అవసరమైన ప్రాంతాల్లో చేపట్టాలని తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను ప్రణాళికల్లో భాగం చేయాలని సూచించారు.

***నాలుగు రంగాలకు ప్రాధాన్యం***

వి.బి.జి. రామ్‌జీ ప్రణాళికల్లో నీటి సంరక్షణ, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణ అనే నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్



తెలిపారు. పాఠశాల భవనాలు, ప్రహరీ గోడలు, అంగన్‌వాడీ భవనాలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల వంటి అవసరాలను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని సూచించారు. ఫామ్ పాండ్లను నీటి నిల్వతో పాటు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చేపల పెంపకం, పశుపోషణ వంటి జీవనోపాధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. అధిక వర్షాల సమయంలో వరదలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కాలువలు, చెరువులు, కుంటలు, ఫీల్డ్ ఛానళ్ల అభివృద్ధికి అవసరమైన పనులను ముందుగానే గుర్తించాలని సూచించారు.

***గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు***

ప్రతి గ్రామానికి ఒకే విధమైన ప్రణాళిక కాకుండా ఆయా గ్రామాల భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలు, వర్షాభావ ప్రభావం, ప్రజల సమస్యలకు అనుగుణంగా పనులను ఎంపిక చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జి.పి.డి.పి., జిసాప్ తదితర ప్రణాళికల్లో ఇప్పటికే గుర్తించిన పనులను వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికతో అనుసంధానం చేసి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రణాళిక రూపకల్పనకు ముందు బేస్‌లైన్ డేటా, సోషల్ మ్యాపింగ్, రిసోర్స్ మ్యాపింగ్ నిర్వహించాలని, గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు, చెరువులు, కుంటలు, కాలువలు, ఎత్తైన, లోతట్టు ప్రాంతాలను మ్యాప్‌లో గుర్తించాలని తెలిపారు.

***మూడు సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళిక***

2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులతో పాటు తదుపరి మూడు సంవత్సరాలకు సంబంధించిన దీర్ఘకాలిక ప్రణాళికను కూడా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రణాళికలు కేవలం అధికారిక ప్రక్రియగా కాకుండా గ్రామాల వాస్తవ అవసరాలకు అనుగుణంగా, కొలిచే ఫలితాలు వచ్చేలా ఉండాలని తెలిపారు. నీటి సంరక్షణ, వర్షాభావ నివారణ పనుల్లో ప్రజలు, రైతులను భాగస్వాములను చేయాలని సర్పంచులకు సూచించారు. మంచి పనితీరు కనబరిచే గ్రామ పంచాయతీలను గుర్తించి ప్రోత్సహిస్తామని, ఉత్తమంగా పనిచేసే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో గ్రామాభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించి అవసరమైన తీర్మానాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద కి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య



గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాద్, బుద్ధ భవన్ లో గురువారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారద ని రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.. ఈ సందర్భంగా నేరెళ్ల శారద కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, మహిళల హక్కులు, సంక్షేమం, సాధికారత కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మహిళలకు న్యాయం, భద్రత, సమాన అవకాశాలు కల్పించే దిశగా మహిళా కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని వారు కోరుకున్నారు. నేరెళ్ల శారద నాయకత్వంలో మహిళా కమిషన్ ప్రజలకు మరింత చేరువగా సేవలందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కేఎల్‌హెచ్‌లో 'ఏఐ-ఎస్ఐఐఎస్ 2026' ప్రారంభం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్‌లో మూడు రోజుల 'ఐఈఈఈ ఏఐ-ఎస్ఐఐఎస్ 2026' సదస్సు ప్రారంభమైందని కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ ఏఐ, ఇండస్ట్రియల్ ఎల్ఓటీ భద్రత, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్‌పై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. 886 పరిశోధన పత్రాల్లో 187 ఆమోదం పొందగా, 123 ప్రదర్శనకు నమోదైనట్లు తెలిపారు. సదస్సులో జువాన్ జోస్ రోడ్రిగ్రెజ్-ఆండినా, స్టామాటిస్ కర్నౌస్కోస్, జాన్ హాస్, కవింగా ఉపుల్ ఏకనాయక, ప్రీతి బజాజ్, ఆశిష్ సింఘాల్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రపంచ పరిశోధన, పరిశ్రమల దృక్పథాలను క్యాంపస్‌కు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణ మార్గదర్శకత్వంలో డాక్టర్ మౌస్మి అజయ్ చౌరాసియా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## దక్షిణాది విద్యార్థులపై రెండేళ్లు ప్రత్యేక దృష్టి

**- ఫిజిక్స్‌వాలా వ్యవస్థాపకుడు, సీఈఓ అలఖ్ పాండే**



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : దక్షిణ భారతదేశంలో విద్యా సేవలను విస్తరించేందుకు వచ్చే 24 నెలలు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు ఫిజిక్స్‌వాలా(పిడబ్ల్యూ) వ్యవస్థాపకుడు, సీఈఓ అలఖ్ పాండే గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళలో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబియు)తో ఐదేళ్ల భాగస్వామ్యంతో 18 వేల మందికి పైగా విద్యార్థులకు ఏఐ, స్కిల్లింగ్, కెరీర్ కోర్సులు అందించనున్నట్లు చెప్పారు. ప్రతీక్ మహేశ్వరి తోకలసి 2020లో స్థాపించిన పిడబ్ల్యూ ఇప్పటివరకు 4 కోట్ల మందికి పైగా విద్యార్థులను చేరుకున్నట్లు తెలిపారు. 2025-26లో 50 లక్షలకు పైగా పెయిడ్ విద్యార్థులు నమోదు కాగా, 16 టెస్ట్ ప్రిపరేషన్ విభాగాల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

## గణేష్ నిమజ్జనానికి కాగజ్‌నగర్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): కాగజ్ నగర్ పట్టణంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ప్రజల్లో భరోసా కల్పించేందుకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వహీ ఉద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్ఓ ప్రేమ్ కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, టౌన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక పోలీస్ బృందం ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, నిమజ్జన మార్గాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తూ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని సూచించారు. భక్తులు, యువత సంయమనం పాటిస్తూ నిమజ్జన వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## హయత్‌నగర్‌లో కల్తీ అల్లం - వెల్లుల్లి పేస్ట్ కలకలం

**- 730 కిలోలు సీజ్**

హైదరాబాద్ : హయత్‌నగర్‌లోని అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్‌పై ఓ-ఈయూ, ూూ ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్నట్లు అనుమానిస్తున్న సుమారు 730 కిలోల కల్తీ పేస్ట్‌తో పాటు గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిని అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పేస్ట్ తయారీలో స్వాధీనం చేసుకున్న ద్రావణం, ఫుడ్ కలర్ వినియోగంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్ జిల్లా ఎస్పీ నితికా పంత్,

**- బంగారు ఆభరణాలను విక్రయించేందుకు సహకరించిన మరో ఇద్దరి అరెస్ట్..**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24;(విజన్ ఆంధ్ర) : ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన మేకర్తి మల్లక్క, భర్త సాంబయ్య, వయస్సు 80 సంవత్సరాలు, గృహిణి. ఆమె తన ఇంటిలో ఒంటరిగా నివసించేది.మృతురాలు ఒంటరిగా నివసిస్తున్న విషయాన్ని ఆమెకు సమీప బంధువైన ూ1 మేకర్తి ధనుంజయ్ గమనించాడు. మద్యం సేవించడంతో పాటు తన వ్యక్తిగత అవసరాల కోసం డబ్బు అవసరం కావడంతో, మృతురాలి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించాలని నిందితుడు పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతురాలు తనకు బంధువు కావడంతో తనను గుర్తించే అవకాశం ఉందని భావించిన ూ1, ఆమెను హత్య చేసి బంగారు ఆభరణాలు దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో 30-08-2026 రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో మృతురాలు ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో ూ1 ఆమె ఇంటిలోకి ప్రవేశించి,అక్కడ ఉన్న బండరాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలను తీసుకున్నాడు.ఇంటిలోని బీరువాను పగలగొట్టి ఇతర విలువైన వస్తువుల కోసం వెతికాడు.మృతురాలి మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా ఉండేలా మరో గదిలో వంట చెరకు కోసం మృతురాలు తెచ్చుకున్న కర్రలతో కప్పి అక్కడి నుంచి పరారైనట్లు దర్యాప్తులో తేలింది. నేరానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, నేరాలను ఛేదించడంలో జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఆసిఫాబాద్ డీఎస్పీ బి.అశోక్,ఆసిఫాబాద్ టౌన్ సీఐ బి. రవికుమార్, ఏఎస్ఐ భోజ గౌడ్ ,కానిస్టేబుల్ ప్రేమ్ కుమార్ ,శేషారావు,సాగర్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్, అభినందించారు.

# ఈనెల 30 నాటికి డిజిటల్ క్రాస్ సర్వేను పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**




రంగారెడ్డి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24,( విజన్ ఆంధ్ర ): సెప్టెంబర్ 30 నాటికి డిజిటల్ క్రాస్ సర్వేను పూర్తి చేయాలని రంగా రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి చంద్రారెడ్డి అన్నారు. వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే మరియు రైతు నమోదు ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ మరియు కార్యదర్శి సూచనల మేరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లైస్, మీసేవ, మరియు సబ్ సెంటర్ల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభం అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 30, 2026 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 500 బోనస్ వర్తించే 7 సన్న వరి రకాలు ప్రభుత్వం గుర్తించిన (1) బిపిటి-5204, (2)ఆర్ ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), (3) కెఎన్ఎం-1638, (4) కెఎన్ఎం-7715, (5) హెచ్ ఎం టి సోనా, (6) జై శ్రీరామ్, (7) డబ్ల్యూ జి ఎల్ -44 అనే ఏడు రకాల సన్న వరి పంటలకు మాత్రమే క్వింటాలుకు రూ. 500 బోనస్ వర్తిస్తుందని, కొనుగోలు ప్రక్రియకు క్రాప్ సర్వే డేటా ఎంతో కీలకమని తెలియజేశారు. రైతు నమోదు అవశ్యకత ప్రభుత్వ పథకాల సబ్సిడీలు పొందడానికి మరియు ఎరువుల కొనుగోలు యాప్ (ఎఫ్ఎఫ్ఎస్)లో బుకింగ్ చేసుకోవడానికి రైతు నమోదు సంఖ్య తప్పనిసరి అన్నారు. ప్రత్యేక క్యాంపులు మరియు ప్రచారం ప్రతి గ్రామంలో మీసేవ మరియు కామన్ సర్వీస్ సెంటర్ల భాగస్వామ్యంతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అలాగే చాటింపు మరియు ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఎం. సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ మరియు ఇతర శాఖల అధికారులు, మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ల జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర ) : ఖరీఫ్ సీజన్ లో జిల్లాలోని రైతులకు ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ లతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 1 లక్ష 80 వేల మంది రైతులకు సంబంధించి రైతు నమోదు, డిజిటల్ క్రాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, రైతు నమోదు ప్రక్రియను క్లస్టర్ల వారీగా చేపట్టాలని తెలిపారు. ఈ అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి , ఎలాంటి పొరపాట్లు లేకుండా రైతుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో కొనుగోలు చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మౌలిక వసతులు, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ముందుగానే నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసి, రైతులకు చెల్లింపులు నిర్ణీత సమయంలో జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించడం, ధాన్యం సేకరణ, నిల్వలు, మిల్లులకు తరలింపు తదితర అంశాలను సమన్వయం చేయాలని, రైతులకు ధాన్యం నాణ్యత, తేమ శాతం, ప్రమాణాలు, నిబంధనలు, కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ధాన్యం విక్రయానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో తూకం, ధాన్యం రాక, నిల్వ, రవాణా తదితర ప్రక్రియలను సంబంధిత శాఖలతో సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, బస్తాల తరలింపు తదితర పనులకు అవసరమైన హమాలీలు, కార్మికుల లభ్యతను నిర్ధారించి, కార్మికుల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ రిమ్స్ అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించిందని, బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలుస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. ఈ విషాదకర ఘటనపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆయన పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి, వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారని, ఆ మేరకు మంత్రులు కూడా =×మీా ఆసుపత్రిని సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు మానవతా దృక్పథంతో అండగా నిలవాల్సింది పోయి, ప్రతిపక్షాలు అనవసరంగా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. రాజకీయ స్వలాభం కోసం బాధితుల ఆవేదనను రాజకీయ అంశంగా మార్చడం బాధ్యతారాహిత్యమని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, విద్యారంగాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడించారు. అలాగే అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల కల్పనకు సంబంధించి మంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత సహాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బాల్యూరి గోవర్ధన్ రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు అంబకంటి అశోక్, డీసీసీ ఆఫీస్ ఇన్‌చార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గౌలి సంజయ్, జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పరమేశ్వర్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, టౌన్ ప్రెసిడెంట్ కిజార్ పాషా, టౌన్ కార్యదర్శి లింగంపల్లి నర్సింలు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశం

**- విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులపై సమీక్ష:**

**- అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులు వెంటనే తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ సూచించారు. ఈ మేరకు గురువారం ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, విధుల్లో చేరని ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన స్థానాల్లో విధుల్లో చేరని ఉపాధ్యాయులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే రిలీవ్ చేసి, వారు తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయుల రిలీవింగ్, జాయినింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# దసరా నాటికి పదవులు పంపకం



నల్గొండ, సెప్టెంబర్ 24, : రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, అధికార కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టు ప్రణాళికలు రచిస్తోంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే పదవుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాలు, ఖంఊ, మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారుఇటీవల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పార్టీ అధిష్టానంతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆశావహుల జాబితాను హైకమాండ్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నియామకాలపై తుది నిర్ణయం వెలువడనుంది. విజయదశమి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్యకర్తలకు దసరా కానుకగా అందించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.గత ఎన్నికల నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు, గ్రాస్‌రూట్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అదే సమయంలో పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు సుమారు 20 శాతం మేర ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంది. అలాగే సామాజిక సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలకు సముచిత స్థానం కల్పించనున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఖాళీగా ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ వంటి ఇతర కీలక పదవులను కూడా భర్తీ చేసే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.మొత్తానికి.. దసరా పండుగ వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటించబోయే ఈ నామినేటెడ్ పదవుల జాబితా పార్టీలో నెలకొన్న అసంతృప్తులను తొలగించి, శ్రేణుల్లో జోష్ నింపుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. రాబోయే రాజకీయ పోరుకు ఈ నియామకాలు ఒక బలమైన పునాదిగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## ఆయుర్వేదానికి పూర్వ వైభవం

హైదరాబాద్ : ప్రాచీన భారతీయ వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ ఆయుర్వేద డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్య సంప్రదాయమని పేర్కొన్నారు. గతంలో దేశాన్ని పాలించిన మొఘలులు, బ్రిటిష్ పాలకులు ఆయుర్వేద వైద్య విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆయుర్వేదానికి దేశవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతోందని తెలిపారు. ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం లభిస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఆయుర్వేదంపై మరింత అవగాహన కల్పించడం తో పాటు, సంప్రదాయ వైద్య విధానాలను ఆధునిక పరిశోధనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం నుంచి ఆయుర్వేద ఉత్పత్తుల ఎగుమతులు 20 శాతం పెరిగినట్లు ఆయన గుర్తుచేశారు. ఆయుర్వేద వైద్య విధానం, ఔషధ ఉత్పత్తుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తోందన్నారు.అనంతరం ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు వైద్యులను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు.

# అర్బన్ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



నిజామాబాద్ సెప్టెంబర్24:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తో కలిసి సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సౌత్ మండలంలో ఇటీవల కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ లకు మంజూరైన 1.25కోట్లతో తొందరగా మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. అలాగే మినీ ట్యాంక్ బండ్ నిర్వహణను నీటిపారుదల శాఖ నుంచి కార్పొరేషన్కు అప్పగించాలన్నారు. అలాగే నార్త్ మండలానికి సంబంధించి డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా ఈ నెల 25న ఇందూరులో నిర్వహించే గణపతి నిమజ్జన శోభాయాత్ర కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్ ల సమస్యపై కమిషనర్ దిలీప్ కుమార్ తో కలిసి పరిశీలించారు. వీలైనంత తొందరగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, ఇరిగేషన్ శాఖ ఈ ఈ నరేందర్, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర); జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూముల రీ సర్వే ప్రక్రియపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన రీ సర్వే వివరాలు, పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 16 సర్వే యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ, 16 ప్రత్యేక బృందాల ద్వారా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రతి సర్వే బృందంలోని సిబ్బంది సమన్వయంతో, నిర్దేశిత విధానాలను పాటిస్తూ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూమి యజమాని, సరిహద్దు భూముల రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి, ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే నిర్వహించే తేదీ, సమయానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేయాలని సూచించారు. అలాగే, గ్రామాల వారీగా సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయడంతో పాటు ఖచ్చితమైన మ్యాపులను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తూ, నిర్దేశిత లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏ.డీ. ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మందిరమా.. మందుబాబుల అడ్డానా..?

**- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన క్రీడా ప్రాంగణం..!**

**- భద్రత గాలికొదిలేసిన వైనంపై స్థానికుల తీవ్ర ఆందోళన..!**




ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడాకారులు, యువత కోసం ఉపయోగపడాల్సిన స్థానిక ఇంద్ర ప్రియదర్శిని స్టేడియంలో రాత్రివేళల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. స్టేడియం పరిసరాల్లో మద్యం బాటిళ్లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు స్టేడియం పరిసరాల్లో మద్యం సేవిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అక్కడ కనిపిస్తున్న మద్యం బాటిళ్లు మరిన్ని ప్రశ్నలకు తావిస్తున్నాయి. అయితే ఈ బాటిళ్లు అక్కడే మద్యం సేవించినవారివేనని అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. క్రీడల కోసం ఏర్పాటు చేసిన స్టేడియం పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో భద్రతా సిబ్బంది పర్యవేక్షణ, పోలీసుల పెట్రోలింగ్ లోపం కొట్టుమిట్టాడుతోంది. సీసీ కెమెరాల ఏర్పాటు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. క్రీడా ప్రాంగణం క్రీడలకు స్ఫూర్తిగా ఉండాలి తప్ప మద్యం బాటిళ్లకు, మందుబాబు లకు అడ్డాగా మారకూడదని వాకర్స్ కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్టేడియం పరిసరాలను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు ప్రారంభం



నిజామాబాద్ సెప్టెంబర్24:( విజన్ ఆంధ్ర ) : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ చాంబరులో "వృద్ధుల సంక్షేమం మరియు సాధికారత వారోత్సవం 2026" ప్రారంభ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు, వారు పొందాల్సిన హక్కులు, రక్షణ చట్టాల వివరాలతో కూడిన విస్తృత ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సమాజంలో వయోవృద్ధుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమానికి మరియు సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (ఎల్బీ) భుజంగరావు, జిల్లా సంక్షేమ అధికారిణి డి. సౌందర్య, పర్యవేక్షకులు శ్రీనివాస్, రేఖలు పాల్గొన్నారు. పోలీస్ శాఖ తరపున ఎస్ఐ రాజు హాజరయ్యారు. జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, మాయావార్ రాజేశ్వర్, నారాయణ రెడ్డి, ఫయాజుద్దీన్, వాసవి క్లబ్ సభ్యుడు రవిలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న సీనియర్ సిటిజన్ ఫోరమ్‌లు, అసోసియేషన్లు, ట్రస్టులు, ఫౌండేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గణపతి నిమజ్జనంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి

**- అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన డీజేలు, సౌండ్ సిస్టమ్‌లపై కేసులు**

**- కాచ్కంటి, భరంపూర్ గ్రామాల్లో డీజేలు, వాహనాలు సీజ్**

**- 30 పోలీస్ యాక్ట్, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి**




ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర బ్యూరో)గణపతి నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ, ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 23న కాచ్కంటి గ్రామంలో గణపతి నిమజ్జన బందోబస్తు సందర్భంగా అనుమతి లేకుండా వాహనంలో డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అధిక శబ్దంతో వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు డీజే యజమాని వావల్కర్ కళ్యాణ్, ం/శీ యాదవ్‌పై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని భరంపూర్ గ్రామంలో గణపతి నిమజ్జన ఉత్సవాల సందర్భంగా రెండు గణపతి మండపాల మధ్య డీజే సౌండ్‌పై పోటీ ఏర్పడి, గొడవలకు దారితీసే పరిస్థితులు ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ డీజేలు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి, రెండు డీజే సౌండ్ సిస్టమ్‌లతో పాటు బొలెరో మ్యాక్స్ వాహనాన్ని సీజ్ చేశారు. గణపతి నిమజ్జన ఉత్సవాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేయాలంటే ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ స్పష్టం చేశారు. 30 పోలీస్ యాక్ట్, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, పోలీసుల సూచనలు పాటించకపోవడం, ఇతర మండపాలతో పోటీకి దిగడం లేదా గొడవలకు దారితీసే విధంగా వ్యవహరించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ గణపతి నిమజ్జన కార్యక్రమాలను భక్తి భావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ హెచ్చరించారు.

# గణేష్ శోభాయాత్ర కోసం పటిష్టమైన నిఘా.

**- 1300 మంది పోలీసులతో భారీ ఏర్పాట్లు.**

**- డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ, 200 సీసీ కెమెరాలతో గట్టి నిఘా.**

**- గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సిద్ధమైన రథం**




నిజామాబాద్ సెప్టెంబర్ 24 ( విజన్ ఆంధ్ర ) : గణేష్ శోభాయాత్రకు నిజామాబాద్ పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. శోభాయాత్ర సాగే ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం దుబ్బ ప్రాంతం నుండి శోభాయాత్ర ప్రారంభం కానుంది. ఇందుకోసం సార్వజనిక్ గణేష్ మండలి వారు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. దారి పొడవున అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రథయాత్ర సాగే ప్రాంతాలలో గుంతలను పూడ్చివేశారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తో పాటు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త రూట్ మ్యాప్ ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త అధికారులకు సూచించారు. భారీ వినాయక విగ్రహాలను బాసర తో పాటు ఉమ్మెడ తదితర గోదావరి లో నిమజ్జనం చేసే విధంగా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రమాదాలు జరగకుండా నిమజ్జన ప్రదేశాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ లలోని అన్ని గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సం శోభాయాత్ర సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు.గణేష్ నిమజ్జనోత్సవ శోభాయాత్ర శాంతియుతంగా సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అన్ని డివిజన్ పరిధిలలో ప్రధాన నిమజ్జన మార్గాల్లో దాదాపు 1300 మందికి పైగా పోలీస్ సిబ్బందిని నియమించామని,సీసీ కెమెరాల ద్వారా నిఘా డ్రోన్ కెమెరాలతోపర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాట్లు చేపట్టారు. ఏర్పాట్లను పోలీస్ సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ, ఫారెస్టు శాఖ, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వారితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రజలకు సూచించారు. రథయాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ను డైవర్షన్ చేశారు. ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలని, డి.జేలు పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ఎటువంటి పుకార్ల ను నమ్మకుండా గణేష్ శోభాయాత్రను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, పోలీసులకు సహకరించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రజలకు సూచించారు.మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అత్యవసర సమయంలో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 112 డయల్, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126-59700 సంప్రదించాలని తెలిపారు.ప్రజలందరూ ఈ గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు.

# మల్లమ్మకుంట,సాగునీటి సమస్యలపై రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తిచేయాలి

***మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్***



అలంపూర్ సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అలంపూర్, నియోజకవర్గాల్లోని సాగునీటి సమస్యలు, మల్లమ్మకుంటకు సంబంధించిన అంశాలపై సుమారు గంటపాటు సుదీర్ఘంగా చర్చించారు. మల్లమ్మకుంట భూ సేకరణ అంశంపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం కావాలని ఆదేశాలు జారీ కావాలని మల్లమ్మ కుంట రైతులందరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ భూమి రేటు కూడా లోటు లేకుండా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఆర్డీఎస్, జూరాల పరిధిలోని రైతుల సాగునీటి సమస్యలను డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి, సీనియర్ ఐఏఎస్ అధికారి, ల్యాండ్ అక్విజిషన్ కమిషనర్ శివకుమార్ నాయుడుకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించినట్లు డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో చరవాణిలో వెల్లడించారు. ఈ విషయాన్ని మీడియా ప్రజాప్రతినిధులకు చరవాణి ద్వారా అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ వివరించారు. సంబంధిత ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆర్డీఎస్, జూరాల పరిధిలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై అలంపూర్, గద్వాల నియోజకవర్గాల రైతులు డాక్టర్. ఎస్.ఏ. సంపత్ కుమార్ కి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# డప్పుల దరువులు.. డోలు బ్యాండ్లు.. సంప్రదాయ నృత్యాలతో అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24(విజన్ఆంధ్ర) : డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా.. కాలినడకన నిమజ్జన రూట్‌ను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ పోలీసుల పటిష్ట బందోబస్తు.. నిర్వాహకులు, ప్రజల సహకారంతో ప్రశాంతంగా కొనసాగుతున్న నిమజ్జనం నిమజ్జన శోభాయాత్రను తిలకించే ప్రజలు తగిన జాగ్రత్తలు సూచించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో భక్తి, సంప్రదాయం, భద్రతకు పెద్దపీట కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర భక్తిశ్రద్ధలు, డప్పుల దరువులు, డోలు బ్యాండ్లు, సంప్రదాయ నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. గణనాథుడి శోభాయాత్రను తిలకించేందుకు కామారెడ్డి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయమని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, తెలిపారు. భక్తి, ఆనందోత్సాహాలతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తూ, డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా భద్రతా ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా స్వయంగా కాలినడకన నిమజ్జన రూట్‌లో పర్యటిస్తూ పోలీసు అధికారులు, సిబ్బందికి, గణేష్ మండపాల నిర్వాహకులకు ఉత్సాహాన్ని నింపారు. శోభాయాత్ర సజావుగా సాగేందుకు క్షేత్రస్థాయిలో అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతుండటం పట్ల ఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని, అందరి సమన్వయం, సహకారంతోనే ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు.గణేష్ నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పోలీసుల సూచనలకు సహకరించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. రోడ్లపై గుమిగూడకుండా, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సురక్షితంగా నిమజ్జన వేడుకలను తిలకించాలని సూచించారు. భక్తి, సంప్రదాయం, ఆనందోత్సాహాల మధ్య గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రెస్‌నోట్‌లో ప్రజల స్పందనగా సహజంగా ఇలా చేర్చవచ్చు ,గణేష్ నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు, డీజే శబ్దాలు లేకుండా సంప్రదాయ పద్ధతిలో శోభాయాత్ర కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డీజే సౌండ్ లేకపోవడంతో కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు అవకాశం కలిగిందని, ఎలాంటి ఇబ్బంది కలగలేదని పలువురు తెలిపారు. ప్రజల ప్రశాంతత, భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తీసుకున్న నిర్ణయాల పట్ల ప్రజలు అభినందనలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే. నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ ఎన్నికలకు 31 నామినేషన్లు

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొత్తం 15 మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు 31 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 25న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సెప్టెంబర్ 26న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,( విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ కార్యాలయాలలో విధుల పట్ల సమయపాలన పాటించని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా పౌరసరఫరాల శాఖ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, విద్య, రహదారులు భవనాలు, ఖజానా, గిరిజన సంక్షేమ, పరిశ్రమలు, పర్యాటక, ఆడిట్, వైద్య ఆరోగ్య శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొన్ని కార్యాలయాలలో అనుమతి లేకుండా గైర్హాజరు, కొన్ని కార్యాలయాలలో సమయపాలన పాటించని వైనాన్ని గుర్తించి సంబంధిత శాఖల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల ఖచ్చితంగా సమయపాలన పాటించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం2026 సందర్భంగా ఈ నెల 24వ తేదీ నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు ఈ నెల 24 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. లిసుదీర్ఘ జీవితాల కోసం వ్యవస్థలను పునరాలోచించడంలి అనే నినాదంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న వయోవృద్ధుల ఆరోగ్యం, శ్రేయస్సు దినోత్సవం, 26న వృద్ధాశ్రమాల కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమం, 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వృద్ధులపై జరిగే దుర్వినియోగం నుంచి రక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న తరాల మధ్య అనుబంధం, అభ్యాస దినోత్సవం, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య శ్రేయస్సు, తరాల మధ్య నడక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత, సామాజిక గౌరవం, సాధికారతపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధులకు అవసరమైన సహాయం, సమాచారం, సేవల కోసం ఎల్డర్ లైన్ 14567 ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ఈ నెల 25న నామినేషన్ల పరిశీలన

***జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ***

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,( విజన్ ఆంధ్ర) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఏర్పాటులో భాగంగా అందిన నామినేషన్లను ఈ నెల 25వ తేదీన పరిశీలించడం జరుగుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటులో 15 మంది సభ్యుల ఎంపిక కొరకు గురువారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరిగిందని, 25వ తేదీన నిబంధనల ప్రకారం నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

# భవిష్యత్ నీటి అవసరాల కోసం ఇంకుడు గుంతలు తప్పనిసరి - కోలా రవీందర్





హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( అకెళ్ళ. విశ్వనాథ్ ) : మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి లోని సూరారం గ్రామం లక్ష్మీ నగర్ కాలనీ లో కాలనీవాసులందరూ అధ్యక్షులు అమృతారెడ్డి, కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరూ నవరాత్రుల పాటు పూజించిన గణన్నాదుని నీటితో కరిగించి ఆ మట్టిని ఇంటి వద్ద పూల మొక్కలకు, పెరటిలో చెట్లకు వేయడం ఆనవాయితీ గా వస్తోందన్ని అలా పర్యావరణాన్ని కాపాడుకుంటూ, నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లు వాడకం తగ్గించు కుంటూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తవ్విస్తామని తెలియజేసారు. అలాగే తమ పిల్లలకు ఈత తప్పనిసరిగా నేర్పిస్తామని తెలియపరుస్తూ, సామాజికవేత్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ నేతృత్వంలో ప్రమాణం చేయడం జరిగింది. ఇలాంటి మంచి సూచనలు చేయడం చాలా అరుదు అని, కావున కోలా రవీందర్ చెప్పింది అక్షరాల నిజమని లేకుంటే భవిష్యత్తులో నీటి దొంగలు వచ్చి ఇంట్లో బిందెలెత్తుకెళ్ళ ప్రమాదం ఉందని అందరూ ఆదిశగా ఆలోచించమని కోలా రవీందర్ తెలిపారు. భవిష్యత్ నీటి అవసరాల కోసం ఇంకుడు గుంతలు తప్పనిసరిగా కాలనీలో ఇంకుడు గుంతలు తీసుకుందామని ఆ దిశగా ముచ్చటించుకోవడం చాలా మంచి పరిణామం కాలనీ పెద్దలు తెలిపారు.

# ప్రశాంత్ నగర్ గణనాథ మండపంలో మహా అన్నసమారాధన...

- చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 2500 మందికి అన్న ప్రసాద వితరణ...





శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 24:( విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా 2500 మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చింతకింది గోవర్ధన్ గౌడ్ తెలిపారు. ఈ క్రమంలోనే వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించానని అన్నారు. ఆదర్శ్ నగర్ కాలనీ, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్ గణనాథ మండపాల వద్ద వెయ్యి మంది చొప్పున ఇప్పటికే అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉత్సాహంగా పూర్తి చేశామన్నారు. ప్రశాంత్ నగర్ కాలనీ గణనాథ మండపం వద్ద 2500 మందికి పైగా అన్న ప్రసాద వితరణకు అవకాశం కల్పించిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పరిసర కాలనీల ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మామిడిగూడెం ఆదివాసీ గ్రామంలో సింగరేణి కంటైనర్ బడి ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు సెప్టెంబర్ 24; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఏటూరునాగారం మండలం మామిడిగూడెం ఆదివాసీ గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 15 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ లను కలెక్టర్ తో కలిసి పంపిణీ చేసి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, ఎంపీడీవో, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతికి హాని లేకుండా మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధి - మంత్రి సీతక్క



ములుగు సెప్టెంబర్ 24 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సహజసిద్ధ వాతావరణానికి హాని కలగకుండా, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మంగపేట మండలం మల్లూరులో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ మాస్టర్ ప్లాన్ పై జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు, దేవాదాయ, అటవీ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ – మల్లూరులోని దట్టమైన అడవులు, వందల ఏళ్ల వృక్షాలు, స్వచ్ఛమైన గాలి ఎంతో అరుదైన సంపద అని, దీన్ని డబ్బుతో కొనలేమని అన్నారు. అందుకే ప్రకృతికి భంగం కలగకుండా అభివృద్ధి చేయాలని, ఎవరికీ నష్టం జరగకుండా చూడాలని సూచించారు. భక్తుల రద్దీ దృష్ట్యా తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, విశ్రాంతి స్థలాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆలయ చరిత్ర, స్వామివారి విశిష్టత తెలిసేలా శిల్పాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో మండప విస్తరణ, వసతి గదులు, కల్యాణ మండపం పనులను వేగవంతం చేయాలన్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నూతన గోశాల నిర్మాణానికి మంత్రి, కలెక్టర్ కలిసి భూమిపూజ చేశారు. సమావేశంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆలయ ఈవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లల ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ , డీ.ఎం & హెచ్.ఓ సమీక్ష




నిజామాబాద్ సెప్టెంబర్24:( విజన్ ఆంధ్ర ) : ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న సంఘటనను దృష్టిలో ఉంచుకొని , నిజామాబాద్ జిల్లాలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలను సమీక్షించేందుకు ప్రత్యేక సమావేశం కామెంట్ కంట్రోల్ హాల్ యందు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఐవీ&ఎూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు , వైద్యులు , సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో చిన్నారుల భద్రత , అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు , అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ప్రత్యేకంగా ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో అగ్నిమాపక పరికరాల అందుబాటు , వాటి పనితీరు , అత్యవసర నిష్క్రమణ మార్గాలు , ఫైర్ అలారం వ్యవస్థ , విద్యుత్ భద్రత , సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన , అత్యవసర సమయంలో రోగులను సురక్షితంగా తరలించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులు చికిత్స పొందుతున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు ముందస్తు భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ , ఫైర్ సర్వీసెస్, వైద్య సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే విధంగా అవసరమైన ఏర్పాట్లు , మాక్ డ్రిల్ నిర్వహించాలి అని సూచించారు. ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని , లోపాలు గుర్తించినట్లయితే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు. చిన్నారులు , వారి తల్లిదండ్రులు మరియు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా , ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు పోలీస్ , వైద్య ఆరోగ్య శాఖ మరియు ఫైర్ సర్వీసెస్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ ఎన్ శుభం ప్రకాష్ , డిఎం అండ్ హెచ్ ఓ శ్రీమతి బి. రాజశ్రీ , జిల్లా ఫైర్ అధికారి టి. పరమేశ్వర్ , ఎన్.ఎస్.సి ప్రెసిడెంట్ శ్రీమతి డాక్టర్ కవిత రెడ్డి , డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ , ఐ.ఎం.ఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్ , ఎలక్ట్రిసిటీ ఎస్.ఈ శ్రీ పి.వి రాజేశ్వర్ రావ్ , నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ , ట్రాఫిక్ , సిసిఆర్.బి , ఎ.సి.పి లు శ్రీ ప్రకాష్ , వెంకటేశ్వర రెడ్డి , శ్రీనివాస్ , మస్తాన్ అలీ , గురు నాయుడు , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి , మల్లేశం మరియు జిల్లాలోని చిన్నపిల్లల సంబంధించిన డాక్టర్లు తదితరులు పాల్గొనడం జరిగింది

# ప్రజాస్వామ్యంపై ప్రశ్నల వర్షం!!


- మోదీ రాజీనామా చేయాలి
- ఓటు హక్కుపై స్పష్టత ఇవ్వాలి
- ఈసీ ఎవరికీ జవాబుదారీ?
- ఓటర్ల జాబితాపై ఎంపీ వంశీకృష్ణ ఆగ్రహం



పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో తలెత్తుతున్న అనుమానాలకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కేంద్రం విఫలమైందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడలేని ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఆయన అన్నారు. దేశంలో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై చర్చ జరుగుతున్న సమయంలో బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రధాన బలం అని పేర్కొంటూ, ఆ విశ్వాసానికి ఎలాంటి భంగం కలగకుండా కేంద్రం ప్రతి అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. “దేశ ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు వస్తున్నప్పుడు బాధ్యత ఎవరిది?” అంటూ ప్రధాని మోదీని ఎంపీ వంశీకృష్ణ ప్రశ్నించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని వంశీకృష్ణ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల అర్హతలు, ఓటర్ల జాబితాల్లో మార్పులు, పేర్ల తొలగింపుపై వస్తున్న సందేహాలకు ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి వివరాలతో సమాధానం ఇవ్వాలని అన్నారు. “ఎన్నికల సంఘం ప్రధానికి జవాబుదారీనా.. రాజ్యాంగానికి, దేశ ప్రజలకు జవాబుదారీనా?” అని ప్రశ్నించారు. ఓటు హక్కు కేవలం ఒక హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి అది పునాది అని అన్నారు. కోట్లాది మంది ఓటర్లకు సంబంధించిన అంశాల్లో చిన్న అనుమానం కూడా ప్రజల్లో విశ్వాస సంక్షోభానికి దారితీయకుండా పూర్తి పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు తలెత్తిన వేళ మౌనం సమాధానం కాదని, ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పి తన బాధ్యతను స్పష్టం చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు.

# రిమ్స్ ను సందర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- బాధ్యత కుటుంబాలను ఆదుకుంటాం.



అదిలాబాద్ సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆదిలాబాద్ రిమ్స్ లో ప్రమాద ఘటన నేపథ్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం రిమ్స్ ను సందర్శించారు.డిసిసి అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్,ఇతర నాయకులతో కలిసి ఎస్ఎన్ సీయు వార్డును పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.అగ్ని ప్రమాదంలో పసిపిల్లల ప్రాణాలు కోల్పోవడం చాలా చాలా బాధాకరమని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు.ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందడం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం,అర్హులకు 100% ఇందిరమ్మ ఇంళ్లు అందిస్తామని తెలిపారు.మిగతా చిన్నారులను ఇతర ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని సంఘటనపై ప్రత్యేక కమిటీతో పూర్తిస్థాయి పూర్తిస్థాయి విచారణ చేపట్టామని పేర్కొన్నారు.ఆస్పత్రిలో చోటు చేసుకున్న సంఘటనపై ప్రతిపక్ష నాయకులు తప్పుడు సమాచారాన్ని ,అసత్య ప్రచారాలను వ్యాపింప చేస్తున్నారని ఎమ్మెల్యే బొజ్జు మండిపడ్డారు.మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, టిఆర్ఎస్,చీప్ కవిత వ్యాఖ్యలను ఖండించారు.ఐదుగురు చనిపోతే ఆరుగురని ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు.ఈ సంఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందని నిజానిజాలు తేల్చేందుకు ప్రత్యేక విచారణ కమిటీ కూడా నియమించామన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్,బోత్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి,జిల్లా ఓబీసీ అధ్యక్షుడు అంబకంటి అశోక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షితరాణి కుటుంబానికి ఆర్థిక సాయం!!

- రూ.4.12 లక్షల సహాయం అందజేత
- నిందితులకు కఠిన శిక్ష తప్పదు
- మహిళలపై హింసను సహించం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంటలో దారుణ ఘటనకు గురైన ఇంజనీరింగ్ విద్యార్థిని అక్షితరాణి కుటుంబాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తదితరులు పరామర్శించారు. అక్షితరాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.4,12,500 ఆర్థిక సహాయం మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విషాదంలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా ఇచ్చారు. అక్షితరాణి కుటుంబానికి జరిగిన అన్యాయంపై ప్రభుత్వం సున్నితంగా స్పందించిందని, కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పక ఉండాలని, కేసు దర్యాప్తు పారదర్శకంగా కొనసాగాలని అధికారులను కోరారు. మహిళలు, పేదలు, దళితులపై హింసకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలపై వేధింపులు, హింసకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని నాయకులు స్పష్టం చేశారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడి శిక్ష అనుభవించాల్సిందేనని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అక్షితరాణి కుటుంబానికి న్యాయం అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు ఐక్యతకు ప్రతీక - మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర): గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఐక్యతకు ప్రతీక అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన, మౌలాలి డివిజన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్ గూడలో శ్రీ సంతోషిమాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సందీప్ గౌడ్, బాలసుబ్రమణ్యం, కొండారెడ్డి, భాస్కర, శ్రీనివాస్,అజయ్, ఆశ్రిత్ గౌడ్, రిషి, సామ్రాట్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో వెంకటేష్, శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, వినోద్ యాదవ్, వెంకన్న, చుంకు శ్రీనివాస్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, రఘుయాదవ్, సంపత్ గౌడ్,ఆశా, జాన్ బి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు



# భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు

- రూ. 53,116 పలికిన మొదటి లడ్డూ
- భగత్ సింగ్ యూత్ నిర్వాహకులకు వార్డు ప్రజలు అభినందనలు





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : స్థానిక భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా అత్యంత వైభవంగా సాగిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. నవరాత్రుల ముగింపు సందర్భంగా స్వామివారి ప్రసాదం (లడ్డూ) వేలం పాటను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. బుధవారం రాత్రి వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలోని పదో వార్డులో ఈ వేలం పాటలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ అక్కి సుశీల పాల్గొన్నారు. మొదటి లడ్డూను రూ. 53,116/- చెల్లించి సుభాష్ శెట్టి కుటుంబ సభ్యులు కైవసం చేసుకున్నారు. అలాగే రెండవ లడ్డూను రూ. 20,116/-కు గొల్ల రాములు కుటుంబ సభ్యులు పాడుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక లక్కీ డిప్‌లో స్వామివారి లడ్డూ పరశురాముడు కుటుంబాన్ని వరించింది. ఈ సందర్భంగా భగత్ సింగ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ... తొమ్మిది రోజుల పాటు సాగిన పూజా కార్యక్రమాల్లో, లడ్డూ వేలం పాటలో మరియు లక్కీ డిప్‌లో భక్తులు, మున్సిపాలిటీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గణనాథుని కృపాకటాక్షాలు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.


# పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర); గోదావరి పుష్కరాలకు బాసరకు వచ్చే భక్తులందరికీ అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ బాసరలో పుష్కరాల పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల పార్కింగ్, వీఐపీ, వీవీఐపీ ల పార్కింగ్, హెలిప్యాడ్ నిర్మించనున్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల రాకపోకల సామర్థ్యానికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను ఆయా మార్గాలవారీగా ఏర్పాటు చేయాలన్నారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. భక్తుల అవసరాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సంబంధిత అధికారులు అంతా పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని చెప్పారు. అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోసి గ్రామంలో కర్ర వినాయకునికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు.



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర); తానూరు మండలం బోసి గ్రామంలోని ప్రసిద్ధ కర్ర వినాయకుని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు పూజారులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. స్థానిక శివాలయంలోని గణేశునికి, శివునికి పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక ఉత్సవాలు మొత్తం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. పండుగలన్నీ కలిసిమెలసి జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం తల సేకరణ

**- జిల్లా కలెక్టర్ మనుచౌదరి,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో): గబ్బిలాల పేటలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకు గాను స్థలాన్ని పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి. గురువారం కాప్రా మండలంలోని గబ్బిలాల పేటలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ, ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలు లోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అధార్ లేని పిల్లలకు ఆధార్ క్యాంప్ నిర్వహించి ఆధార్ అందించాలని కాప్రా తహాసీల్దారును ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం నూతన భవనాన్ని నిర్మించేందుకు స్థల సేకరణ నిమిత్తం స్థల వివరాలను తహాసీల్దారును అడిగి తెలుసుకున్నారు. గబ్బిలాల పేటలోని సర్వే నంబర్లు 285, 299, 300, 185 లలో అందుబాటులో ఉన్న స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో ఏమైనా భూ సమస్యలు, కోర్టు కేసులు ఉన్నాయా అనే వివరాలను తకు నివేదిక పంపాలని తహాసీల్దారుకు సూచించారు. స్థానికులు 300 లేదా 185 సర్వే నంబర్లలలో నిర్మిస్తే అందరికి అందుబాటులో ఉంటుందని కోరాగా, పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా విద్యాశాఖ వారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాడానికి ముందుగానే అనుమతిం చడం జరిగిందని వివరించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహాసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మారేపల్లిలో పాఠశాల ప్రారంభం
# రూ.2.20 లక్షలతో పాఠశాల పునరుద్ధరణ



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలం లైన్మ్జాడ గ్రామపంచాయతీ పరిధిలోని మారేపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ హరిత ప్రారంభించారు. సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 2. 20 లక్షల వ్యయంతో పాఠశాలను పునరుద్ధరించారు. పాఠశాల భవనం, పరిసరాలను మెరుగుపరచడంతో విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పాఠశాల పునరుద్ధరణకు సహకరించిన సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# దానం నాగేందర్ పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయం.

**- కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు...ఎంపీ డీకే అరుణ**



గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు చారిత్రాత్మక ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ నేడు సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం ప్రజాస్వామ్య విజయమని తమిళనాడు బీజేపీ సహ ఇంచార్జ్, మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ కొనియాడారు. ప్రజాస్వామ్యానికి, పార్టీ ఫిరాయింపులు గొడ్డలిపెట్టు అని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ కాంగ్రెస్,బిఅర్ఎస్,పార్టీలు సాగించిన అనైతిక రాజకీయాలకు ఈ తీర్పు చెంపపెట్టు అని హర్షం వ్యక్తం చేశారు.రాజీనామా చేయకుండా వ్యక్తిగత,స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి, ఎంపీగా పోటీ చేయడం తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనని, ఇది దిగజారుడు,దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ప్రజాస్వామ్య విలువలను కాల రాస్తూ, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం దుర్మార్గం, హుందా రాజకీయాలను పాతరేసి, రాజకీయ విలువలను నీరుగార్చడం అత్యంత శోచనీయం అన్నారు. పార్టీ ఫిరాయింపులను హైకోర్టు తప్పుబట్టినప్పటికీ సిగ్గులేకుండా, సుప్రీం కోర్టును ఆశ్రయించడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని, ఒక చేత రాజ్యాంగం పట్టుకొని, మరో చేతితో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకత్వ ద్వందా నీతికి అద్దంపడుతుందని, సుప్రీం తీర్పుతో రాహుల్ గాంధీ సిగ్గుపడాలని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూని చేసి,ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ, ప్రజల ఓట్లకు విలువ లేకుండా, కుటిల రాజకీయ క్రీడకి తెరలేపిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఖైరతాబాద్ ప్రజలు ఉప ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఫిరాయింపుల రాజకీయలను పక్కనబెట్టి, పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గ ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణలు కోరి,ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించాలని ఎంపీ డీకే అరుణ ప్రెస్ నోట్ ద్వారా డిమాండ్ చేశారు.

## కాగజ్ నగర్ పట్టణం ప్రధాన రోడ్లపై పశువులు వాహనాలకు ఇబ్బందులు



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువులు గుంపులుగా సంచరిస్తూ, రోడ్లపై వ డు కుం టుం డ టం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై పశువులు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పశువులను తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై పశువులు కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదిలేయకుండా తమ ఇళ్ల వద్ద లేదా పశువుల కొట్టాల్లో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినట్లు స్థానికులు తెలిపారు. పశువులను రోడ్లపై వదలకుండా యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ కొందరి నుంచి స్పందన లేదని పేర్కొన్నారు. నోటీసులను పట్టించుకోకుండా పశు వులను రోడ్లపై వదిలేస్తున్న యజమానులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శ్యామ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ములుగు మండల వ్యాప్తంగా 9 రోజుల ఉచిత నవరాత్రి భక్తి సందడి



ములుగు, సెప్టెంబర్ 24, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రముఖ గాయకుడు, శ్యామ్ సేవా సంస్థ డైరెక్టర్ పోరిక శ్యామల నాయక్ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు మండల వ్యాప్తంగా గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు, ఉచిత అన్నదాన కార్యక్రమాలు సోమవారం బృందావన కాలనీలో ఘనంగా ముగిశాయి. ఈ నవరాత్రి వేడుకల్లో శ్యామ్ కళాబృందం 10 మంది కళాకారులతో ప్రతి గ్రామంలో భక్తి సందడి చేసింది. లేడీ గాయని గడ్డం రజిత, ములుగు గద్దర్ యాకయ్య, డప్పు కళాకారుడు రాజేందర్ , రాజకుమార్, అజయ్ సింగ్ లతో కలిసి శ్యామల నాయక్ కిషన్ జీ మహారాజ్, సేవాలాల్, రామ్ యాడి భక్తి గీతాలు, వినాయక భక్తి గీతాలు, సినిమా పాటలు, స్వచ్ఛభారత్, కిశోర బాలికలపై చైతన్య గీతాలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ నెల 15న దేవగిరపట్నం గ్రామంలోని శివాలయం వద్ద గల వినాయక మండపంలో సర్పంచ్, సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభం కాగా, 16న కసిందేవ్ పేటలో సర్పంచ్ నిరోష అమర్ సింగ్, 17న జగ్గన్న పేటలో సర్పంచ్ ఆరె వెంకన్న, అంగన్వాడీ టీచర్ పద్మ, 18న మదనపల్లిలో సాగర్, జన్ను రవి, సతీష్, మాజీ సర్పంచ్ బాబురావు, 19న జంగాలపల్లిలో సర్పంచ్ మోహన్, 20న ఇన్చర్లలో సర్పంచ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ ఎం. అశోక్, మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ దేవేందర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 21న ములుగు జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో వినాయక విగ్రహ దాతగా మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య , కౌన్సిలర్ బైకాని ఓదెలు, బై కాని సాగర్, విష్ణు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో, చివరి రోజు 22న బృందావన కాలనీలో గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ మాదార వెంకటరావు, కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్, విగ్రహ దాత బానాల సంగీత, శశికుమార్ తదితరుల ఆధ్వర్యంలో వందలాది మంది అక్కాచెల్లెళ్ల సమక్షంలో వేడుకలు ముగిశాయి. ప్రతి గ్రామంలో 100 నుండి 200 మంది భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించి, భక్తి పాటలను ఆస్వాదించారు. శ్యామల నాయక్ కేవలం గాయకుడే కాకుండా ప్రజానాయకుడిగా ఎదిగి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని పలు గ్రామాల సర్పంచులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవగిరిపట్నం గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బబ్లు నాయక్ ధారావత్, బద్రు, ఉప సర్పంచ్ రాజు యాదవ్, గొర్రె సమ్మయ్య, వంగ రవి యాదవ్ తదితరులు కొనియాడారు. శ్యామల నాయక్ కు మహిళలు కుంకుమ తిలకం దిద్ది ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు.

# గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**- హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరి చేయాలి**
**- మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : గర్భిణీల ఆరోగ్యంపై వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని (ఎంసీహెచ్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని గర్భిణీల పరీక్షల విభాగం, ఇతర వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా ఆరా తీశారు. అనంతరం వార్డుల్లోని గర్భిణీలతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, మందుల సరఫరా, పరీక్షల వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

***రక్తహీనత నివారణకు చర్యలు***

వైద్య అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... గర్భిణులకు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) స్థాయిలను తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. హెచ్‌బీ స్థాయి ఆధారంగా అవసరమైన చికిత్స, ఉచిత మందు లు అందించి రక్తహీనతను తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్కానింగ్ గదిని పరిశీలించి, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిర్ణీత విధానాల ప్రకారం స్కానింగ్ సేవలు అందేలా చూడాలని, వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు.

***డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలి***

ఆసుపత్రికి జ్వరం లక్షణాలతో వచ్చే రోగుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే డెంగ్యూ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణకు అనుగుణంగా చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆ తర్వాత క్రిటికల్ కేర్ యూనిట్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ఇటీవలి వర్షాలకు అక్కడ నీరు నిలిచి ఉండటాన్ని గమనించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా, నీటి నిల్వలను వెంటనే ఖాళీ చేయించి డ్రైనేజీ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

***ఎన్ఆర్‌సీకి తరలించాలి***

వైద్యారోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సమన్వ యంతో మండలాల వారీగా ఎదుగుదలలో లోపం ఉన్న చిన్నారులను గుర్తించి, సరైన చికిత్స కోసం ఎన్ఆర్‌సీ (పోషకాహార పునరా వాస కేంద్రం)కి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో భాస్కర్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ చంద్రమోహన్, ఆర్ఎంవో సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై విస్తృత అవగాహన కల్పించాలి

**- జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**
**' వయోవృద్ధుల సమాచార సంచిక', చట్టం పుస్తకాల ఆవిష్కరణ**







వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం మరియు భద్రతపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా వయోవృద్ధుల సమాచార సంచిక పుస్తకంతో పాటు తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం2007 పుస్తకాలను ఆవిష్కరించారు. దీనితో పాటు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, వారికి లభించే ప్రభుత్వ సేవలు, చట్టపరమైన రక్షణకు సంబంధించిన సమాచారంతో పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక డిస్‌ప్లే బోర్డులను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వం వయోవృద్ధుల కోసం అందిస్తున్న సేవలు, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై వయోవృద్ధులతో పాటు ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వయోవృద్ధులు తమ సంక్షేమ పథకాలు, చట్టపరమైన హక్కులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా సమాచారం అందించాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, డిఆర్ డిఓ రామ మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, సిడిపిఓలు మరియు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**
**- గురుకుల పాఠశాల, జిల్లా గ్రంథాలయం తనిఖీ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వనపర్తి మండలం నాగవరం శివారులోని ఎస్సీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా లేదా, ఆహార నాణ్యత, రుచి, వంటగది పరిశుభ్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, విద్యా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యా, మౌలిక సౌకర్యాలు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

గ్రంథాలయంలో వసతుల పరిశీలన

అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి వసతులను తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను పరిశీలించి, పాఠకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై వివరాలు సేకరించారు. పాఠకులకు అవసరమైన వసతులను మరింత మెరుగుపరిచేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులను ప్రేమ, గౌరవంతో చూసుకోవాలి

**- నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్ నగర్ సెప్టెంబరు 23 విజన్ ఆంధ్ర ప్రతినిధి : అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా ప్రేమ, ఆప్యాయతతో చూసుకోవాలని సూచించారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చట్టరీత్యా శిక్షార్హమని, వారి సంరక్షణ, గౌరవం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులు, సంక్షేమంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. వయోవృద్ధులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి, వారికి భద్రతతో కూడిన గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జీడీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, అదనపు డీఎంహెచ్‌ఓ శశికాంత్, డీఐఓ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మిగిలిన సీట్ల భర్తీకి ప్రత్యేక స్పాట్ అడ్మిషన్లు

**- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు**



మల్కాజిగిరి, సెప్టెంబర్ 24, (విజన్ ఆంధ్ర): దోస్త్ 202627లో భాగంగా డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మల్కాజిగిరి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు తెలిపారు. సెప్టెంబరు 24 నుంచి 25 వరకు స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతా యని ఆయన చెప్పారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన విద్యార్థుల వివరాలను ఈనెల 26న దోస్త్ పోర్టల్‌లో అప్లోడ్ చేస్తామని వివరించారు. అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి సెప్టెంబరు 28, 29 తేదీల్లో ఒకేసారి ప్రత్యేక స్పాట్ అడ్మిషన్ రౌండ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో తొలుత స్థానిక అభ్యర్థులకు ప్రాధా న్యత ఇచ్చి, మిగిలిన సీట్లను స్థానికేతర అభ్య ర్థులతో భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలతో కళాశాలకు నేరుగా హాజరై, ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ. 425 చెల్లించాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ బండి రాజు తెలిపారు.

# చలో యాదగిరిగుట్ట

**- దొమ్మటి కిరణ్ కుమార్ రావు, కీర్తి శ్రీనివాస్.**





కాప్రా/సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవాన్ని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించుటకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. చీమ. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు యాదగిరిగుట్ట లోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ లో జరగబోయే సమావేశానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి 33 జిల్లాల ఉద్యమకారులు, ఉద్యమ కారినీల తరలి వచ్చి ఉద్యమకారుల ఫోరమ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మటి కిరణ్ కుమార్ రావు, కో-కన్వీనర్ కీర్తి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 9 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఉద్యమకారులను ఫోరం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి కారులను ఏకం చేసి ఉద్యమ స్ఫూర్తిని చాచిన ఉద్యమకారుల ఫోరమ్ అలుపు ఎరగని పోరాటం చేసి వేలాది మంది ఉద్యమకారులకు అండగా నిలిచి ఉద్యమ కమిటీ ఏర్పాటు చేయడానికి ముఖ్యపాత్ర వహించి హైకోర్టును ఆశ్రయించి విజయం సాధించిన ఘనత ఉద్యమకారులు దీనని ఈ సమావేశం ( ఆదివారం) ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని దొమ్మటి కిరణ్ కుమార్ రావు , కీర్తి శ్రీనివాస్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో గరిక సుధాకర్, శ్రీనివాస్, శివ కుమార్, రాజేశ్వర్ రావు, శ్రీకాంత్, మహి, తదితరులు పాల్గొన్నారు.

## కారులో మంటలు డ్రైవర్ సురక్షితం

హైదరాబాద్: సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు ఇంజన్లో ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన చోటుచేసుకుంది. మెట్రో పిల్లర్ నంబర్ 1644 వద్ద ఎల్బీనగర్?దిల్సుఖ్నగర్ ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ంఖ09అఖ 6421 నంబర్ గల ఌఒఋచింఉఇఔ ఖూబూ కారులోని ఇంజన్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాద సమయంలో కారులో ఒక్కరే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం.. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి
- గిరిజన సంక్షేమ హాస్టల్‌లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో): సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, హాజరుపై వివరాలు తెలుసుకున్నారు. మెనూ చార్ట్‌ను పరిశీలించిన కలెక్టర్.. కిచెన్, గోదాంలోని బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం సిద్ధమవుతున్న తీరును పరిశీలించారు. హాస్టల్ వసతి గదులు, పరిసరాలను తనిఖీ చేసి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులు హాస్టల్‌లోని వసతులను సద్వినియోగం చేసుకుని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## పీజీ సెంటర్లో ఎన్ఎస్ఎస్. ఆవిర్భావ దినోత్సవం



గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పీజీ సెంటర్ గద్వాల పాలమూరు (విశ్వవిద్యాలయం)లో గురువారం రోజు ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు ఎన్ఎస్-ఎస్ కార్యకర్తలు అందరూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, అదేవిధంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో యువత ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వంగూరి గణేష్ గారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం,సామాజిక రుగ్మతలను రూపుమాపే విధంగా విద్యార్థులలో సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్స్ శ్రీ బండారుపల్లి అరవింద, డాక్టర్ గోపీనాథ్ రాథోడ్, డాక్టర్ కొప్పుల మహేందర్, డాక్టర్ రవి షరీన్, ఎల్ నవీన్ గౌడ్, లక్ష్మయ్య, రఫీ, రంగారెడ్డి, డాక్టర్ శ్రీ వైష్ణవ వేణుగోపాల్, నరేష్ రెడ్డి, నమ్రత, శ్వేత, శ్రీనివాసులు అలాగే బోధనేతర సిబ్బంది అన్వేష్, దేవరాజు, నాగరాజు, సుజాత అధిక సంఖ్యలో విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆదేపల్లిలో లడ్డూ వేలం పాట.. రూ.18,016లకు దక్కించుకున్న గాల్లే విష్ణు



చింతలమానేపల్లి, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం ఆదేపల్లి గ్రామంలో యువజన గణేష్ మండలి ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటను గురువారం ఘనంగా నిర్వహించారు. గణేష్ మండపం వద్ద నిర్వహించిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణేశుని లడ్డూను దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో గాల్లే విష్ణు రూ. 18,016లకు గణేశుని లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న విష్ణును గ్రామస్తులు, గణేష్ మండలి సభ్యులు అభినందించారు. గణేశుని లడ్డూను ప్రసాదంగా భావించి భక్తిశ్రద్ధలతో దక్కించుకోవడం ఆనవాయితీగా వస్తోందని మండలి సభ్యులు తెలిపారు. లడ్డూ వేలం పాట సందర్భంగా గణేష్ మండపం వద్ద భక్తులతో సందడి నెలకొంది. మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గణేష్ ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గణేష్ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మండలి సభ్యులు పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## నిమర్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర) : వినాయక నిమర్జనం ప్రక్రియను నిర్వహించాలని నిమర్జన ప్రదేశాలను అవసరమైన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గోడవెల్లి వద్ద పెద్దవాళ్లు వినాయకుల నిమర్జన ప్రదేశాన్ని మండల అధికారి లోకేశ్వర్ రావు, మండల తహసిల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయకులను తీసుకువచ్చే మార్గంలో వర్షాల వల్ల రహదారి బురదమయంగా మారిందని, ఈ క్రమంలో రహదారిపై గుంతలను వెంటనే పూడ్చాలని తెలిపారు. నిమర్జనం ప్రదేశం వద్ద వెలుతురు ఉండేలా అవసరమైతే జనరేటర్ ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాగులో నిమజ్జన సమయంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, వినాయకుల నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశం వద్ద పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం.. సాగుపై కలెక్టర్ సమీక్ష

- క్రాప్ బుకింగ్‌కు వేగం.. ఎరువులపై భరోసా
- ఆయిల్‌పామ్, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో): రైతుల సాగు వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు చేపట్టిన క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక అంశాలపై గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వ్యవసాయ, ఉద్యానవన, సహకార, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 56 శాతం క్రాప్ బుకింగ్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఎరువులపై కొరత లేదు.. నిల్వలు ఉన్నాయి ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో 21 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటివరకు 23 వేల మెట్రిక్ టన్నుల విక్రయాలు పూర్తయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. మరో 2 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

***ఆయిల్‌పామ్ లక్ష్యం చేరాలి***

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. సాగుతో వచ్చే ఆదాయం, ప్రభుత్వ సబ్సిడీలు, మద్దతు ధర, దిగుబడి వివరాలను రైతులకు వివరించి ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్నుకు రూ. 24,025 ధర ఉందని తెలిపారు. రైతుల నుంచి ప్లాంట్, డ్రిప్‌కు సంబంధించిన డీడీలు తీసుకుని సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే ఆయిల్‌పామ్ దిగుబడులు వస్తున్నాయని, జిల్లాకు సమీపంలోనే ఫ్యాక్టరీ అందుబాటులోకి రావడం కూడా రైతులకు అనుకూల అంశమని పేర్కొన్నారు.

***వర్షాభావ పరిస్థితులకు ప్రత్యామ్నాయ సాగు***

వర్షపాతం తక్కువగా నమోదయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పండ్ల తోటలు, పప్పుధాన్యాలు తదితర పంటల ద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్. శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నామినేషన్ లా స్వీకరణ





కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణకు సంబంధించిన తేదీలు, సమయాలు మరియు నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

***నామినేషన్ ఫారాల పంపిణీ:***

24-09-2026 ఉదయం 9:00 గంటల నుంచి కలెక్టరేట్‌లోని ×ఋజా రూమ్ నంబర్ 111లో నామినేషన్ ఫారాలు అందుబాటులో ఉంటాయి. నవరించిన నామినేషన్ ఫారాలను సంబంధిత తహశీల్దార్ లేదా వీఋజా కార్యాలయాల నుంచి కూడా పొందవచ్చు.

***నామినేషన్ల స్వీకరణ:***

పూర్తి చేసిన నామినేషన్ పత్రాలను కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ×ఋజా రూమ్ నంబర్ 111లో ఎన్నికల అధికారికి సమర్పించాలి. నామినేషన్ల స్వీకరణ 24-09-2026న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు మాత్రమే జరుగుతుంది. మధ్యాహ్నం 1:00 గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లు స్వీకరించబడవు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థి పేరు తప్పనిసరిగా రెడ్ క్రాస్ ఓటర్ల జాబితాలో నమోదై ఉండాలి. నామినేషన్ ఫారంలో అభ్యర్థి పేరును ఓటర్ల జాబితాలో ఉన్న విధంగానే నమోదు చేయాలి. ఈ ఎన్నికల్లో ఎలాంటి గుర్తులు లేదా సింబల్స్ ఆధారంగా ఎన్నికలు నిర్వహించబడవు.

ప్రతి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలి. అలాగే రూ. 10,000/- నామినేషన్ రుసుమును నగదు రూపంలో చెల్లించాలి. నామినేషన్ పత్రంతో పాటు అభ్యర్థికి ఒక ప్రతిపాదకుడు (ౡతీశీజూశింవతీ), ఒక మద్దతుదారుడు (ఞవషశీఅఎవతీ) ఉండటం తప్పనిసరి. అభ్యర్థి, ప్రతిపాదకుడు మరియు మద్దతుదారుల ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను నామినేషన్ పత్రాలతో పాటు సమర్పించాలి.

***నామినేషన్ల పరిశీలన:***

25-09-2026న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించబడుతుంది.

***నామినేషన్ల ఉపసంహరణ:***

26-09-2026న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. నామినేషన్ ఉపసంహరించుకున్నప్పటికీ చెల్లించిన నామినేషన్ రుసుము తిరిగి చెల్లించబడదు. నామినేషన్ దాఖలు మరియు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోని ×ఋజా రూమ్ నంబర్ 111లో ఎన్నికల అధికారి/ఉప ఎన్నికల అధికారిని సంప్రదించవచ్చు. అదనపు సమాచారం కోసం 9989487624 నంబర్‌లో సంప్రదించాలని ఎన్నికల అధికారులు సూచించారు.

# అర్హులైన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలి


***భూ సేకరణ అంశ పై అధికారులకు ఒకరోజు శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఓ ఎస్ టి మనోహర్***




భూపాలపల్లి జిల్లా 24 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేయుటకు భూ సేకరణ చట్టం, నిబంధనలు మరియు పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులకు సూచించారు. భూ సేకరణలో భూసేకరణ చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులపై రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి హెచ్ఎండీఏ, టిజిఐఐసిలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ తో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్, సింగరేణి, జెన్‌కో, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూసేకరణ జరుగినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో భూ సేకరణ జరిగిందని, అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం, పునరావాస ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సేకరణలో రైతుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ జాప్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఓఎస్డీ మనోహర్ తెలిపారు. భూసేకరణ చట్టాలకు అనుగుణంగా ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రక్రియకు సంబంధించిన మినిట్స్‌ను నమోదు చేయడంతో పాటు అవసరమైన చోట్ల వీడియో రికార్డింగ్ చేపట్టాలని సూచించారు. భూములు ఇచ్చే రైతులను కేవలం భూమి ఇచ్చేవారిగా కాకుండా ప్రాజెక్టుల్లో భాగస్వాములుగా గౌరవించాలని, అధికారుల వైఖరి వల్ల వారి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని అన్నారు. అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి తలెత్తే వివాదాలను నిబంధనల ప్రకారం విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూముల్లో సాగు చేసుకుంటున్న వారి అర్హతలను తహసీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. భూసేకరణలో భూమి విస్తీర్ణం, రికార్డుల వివరాలు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మనోహర్ సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తధితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారులకు 250 గజాల స్థలం బిఆర్ఎస్ పార్టీ ఇవ్వాలి - డాక్టర్ పిడమర్తి రవి

- అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఉద్యమకారులకు పంచాలి






మహబూబ్ నగర్ సెప్టెంబరు 23 విజన్ ఆంధ్ర ప్రతినిధి తెలంగాణ ఉద్యమకారులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు వారి కుటుంబ సంపాదించిన అక్రమ ఆస్తులు పంచుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు ఈరోజు పాలమూరు యూనివర్సిటీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కోదండరాం రాములు నాయక్ జితేందర్ రెడ్డి గారితో పాటు హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం అక్రమంగా వేల ఎకరాలు దోచుకుందనే వాళ్లు అక్రమంగా సంపాదించిన భూములను ఉద్యమకారులకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కేసీఆర్ మరియు వారి కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు ఎవరు నమ్మరని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని డాక్టర్ రవి గారు అన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు లక్షలాదిమంది ఓటర్లను చైతన్యపరిచే వ్యక్తులుగా ఉంటారని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వంలో సముచిత గుర్తింపు గౌరవం వస్తుందని ప్రగాఢ నమ్మకంతో ఉన్నానని పిడమర్తి రవి అన్నారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉద్యమకారులకు గుర్తింపు కార్డు బస్సు పాసు అదేవిధంగా 20050 గజాల స్థలం మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తానని హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని ఉద్యమకారులకు ప్రజా ప్రభుత్వంలో గుర్తింపు గౌరవం దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లి దశ తెలంగాణ ఉద్యమకారులు ఎండి అన్వర్, నిజ్జన రమేష్, ఎండి రహీం, బుర్ర సురేష్, గడ్డమీది గోపాలకృష్ణ,బోరెల్లి సురేష్, మిట్ట యాదయ్య, దినేష్, కృష్ణ, పోలే నరేందర్, పాలమూరు యూనివర్సిటీ ఉద్యమకారులు అప్పటి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన కొద్ది రోజులకే పావని అనారోగ్యంతో మృతి

- చిన్న వయసులోనే మృత్యువు ఒడిలోకి.. కుటుంబంలో తీవ్ర విషాదం...



అయిజ సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మున్సిపాలిటీ 9వ వార్డు మాలపేట కాలనీకి చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కుమార్తె మాల పావని (20) గురువారం సాయంత్రం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. కష్టపడి చదివి ఇటీవలే ఎంబీబీఎస్ సీటు సాధించిన పావని, వైద్య విద్యలో అడుగుపెట్టి భవిష్యత్తులో డాక్టర్‌గా సేవలందించాలని ఎన్నో కలలు కన్నారు. అయితే ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆనందం పూర్తిగా కుటుంబంలో నిలవకముందే ఆమె మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

## మహాగణపతుల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మహాగణపతుల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ 9వ ఫేజ్, కేపీహెచ్‌బీ 4వ ఫేజ్, కేపీహెచ్‌బీ వెంచర్-2, గాయత్రి నగర్ డివిజన్‌లోని వివేకానంద కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మహాగణపతులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజలందరిలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఎగ్ కార్డుల పంపిణీ చేసిన అరూరి...



వరంగల్ జిల్లాప్రతినిధి సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర); శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్ నందు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ వారి ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన సుమారు 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డులను ముఖ్య అతిధిగా హాజరై మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ గారితో కలిసి పంపిణీ చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ మరియు వరంగల్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు, అరూరి గట్టుమల్ల మెమోరియల్ ఫౌండేషన్ సెక్రెటరీ అరూరి విశాల్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్డులో నాణ్యమైన ప్రోటీన్‌తో పాటు శరీరానికి అవసరమైన పలు విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు లభిస్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, శరీర కండరాల అభివృద్ధికి, శక్తిని అందించడానికి కోడిగుడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు, అందుబాటులో ఉండే ధరలో అధిక పోషక విలువలు అందించే ఆహారంగా కోడిగుడ్డును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు జనరల్ మేనేజర్ డాక్టర్ ఎజిల్ కుమార్ గారు, రాజీవ్, కోళ్ల రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్ రావు స్థానిక నాయకులు, పౌల్ట్రీ రైతులు, లబ్ధిదారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మామునూర్ విమానాశ్రయనికీ అంబేద్కర్ పేరు పెట్టాలి - తెలంగాణ అంబేద్కర్ సంఘం



వరంగల్ జిల్లాప్రతినిధి సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర);- మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మామునూరు విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలో సూచించాలని ఎక్స్లో పోస్ట్ చేసినందున మేము మా సంఘంతో పాటు దళిత ప్రజాసంఘాలు కూడా మామునూరు అంతర్జాతీయ విమాన ఆశ్రమానికి అంబేద్కర్ గారు పేరు పెడితే బాగుంటుందని కూడా మేము ముఖ్యమంత్రి గారికి తెలియజేస్తున్నాం గౌరవ ముఖ్యమంత్రి గారు పూర్తిస్థాయిలో నిర్ణయాత్మకమైన నిర్ణయం తీసుకొని అంబేద్కర్ గారి పేరు పెడితే తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ గారిని గౌరవించుకున్నట్లే నని మేము స్పష్టంగా తెలియజేస్తున్నాం. అలాగే అంతర్జాతీయ స్థాయిలో కూడా అంబేద్కర్ గారిని గౌరవిస్తున్నట్లు ప్రభుత్వానికి చక్కని గుర్తింపు కూడా తెస్తుందని భావిస్తున్నాం. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య, వరంగల్ జిల్లా ఇన్చార్జి తాటికాయల వివేకానంద. వరంగల్ జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్ మండల నాయకులు కొండేటి భాస్కర్ దమ్మన్నపేట ప్రభాకర్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వినాయకుని లడ్డూను కైవసం చేసుకున్న ముస్లిం యువకుడు



మాగనూర్ సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : మాగనూరు మండలంలోని నేరడుగం గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుని లడ్డూను ముస్లిం యువకుడు26001 వేలం పాటలో కైవసం చేసుకున్నారు. గురువారం వినాయకుని నిమజ్జనోత్సవాల సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాహనంలో అలంకరణలు చేసి నిమజ్జనోత్సవానికి గణనాథుని తరలించారు అంతకుముందు వినాయకుని లడ్డూను వేలం వేయగా ఖాజా మైనుద్దీన్ అనే ముస్లిం యువకుడు లడ్డూను కైవసం చేసుకున్నారు అనంతరం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్న ఖాజా మహిమద్దీన్ ను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకొనేది లేదు

**- దళిత సంఘం నాయకులు**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పై నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, సుధమల్ల అశోక్ తేజ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత సంఘం నాయకులు తెలిపారు.గురువారం నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు 2020 లో మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సురిమిల్ల వేణుకు 2023లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కేలా సహకరించారని దళిత సంఘం నాయకులు పేర్కొన్నారు. ఒక సాధారణ కార్యకర్తగా ఉన్న సమయంలో రాజకీయంగా ప్రోత్సహించి పదవి దక్కేలా చేసిన వ్యక్తిపైనే ప్రస్తుతం విమర్శలు చేయడం సరికాదని సూచించారు.వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి, రాజకీయ భేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరచాలని దళిత సంఘం నాయకులు హెచ్చరించారు.ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పై భవిష్యత్తులో ఏవైనా అనుచిత వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని వారన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


## జమ్ములమ్మ ఆలయం వద్ద కొత్త వ్యాపార శోభ..

**- నిషికా కూల్ డ్రింక్స్ షాప్ ప్రారంభించిన హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్**



గద్వాల సెప్టెంబర్ 24 ( విజయ్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని జమ్మిచేడు రోజురోజుకూ ఆర్థికంగా, వ్యాపారపరంగా విస్తరిస్తోంది. అందులో భాగంగా శ్రీ జమ్ములమ్మ దేవాలయ ప్రాంగణం వద్ద వ్యాపార వాతావరణం మరింత వేడెక్కింది. భక్తుల, స్థానికుల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా రూపుదిద్దుకున్న 'నిషికా కూల్ డ్రింక్స్' షాప్ సందడి మధ్య శు భారంభమైంది. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ సూచనలతో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, పూజా కార్యక్రమాల అనంతరం షాప్‌ను ప్రారంభించారు. నాణ్యతకే ప్రాధాన్యం: దేవాలయానికి వచ్చే భక్తులతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి మెరుగైన ఉత్పత్తులను అందించేందుకు ఈ షాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు చెప్పారు. పలువురి హాజరు: ప్రారంభోత్సవంలో స్థానిక ప్రముఖులు సీనియర్ రిపోర్టర్స్ కె రవికుమార్ ముకుందరావు, ప్రసాద్, వెంకటేష్, రాముడు, వెంకయ్య, వీరన్న చారి, బలరాం, పరశురాముడు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు.

## నగరంలో ఆల్‌పెట్స్ రెండో పశువైద్య క్లినిక్ ప్రారంభం




హైదరాబాద్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : నగరంలోని నల్లగండ్లలో ఆల్‌పెట్స్ క్లినిక్ తన రెండో పశువైద్య కేంద్రాన్ని ప్రముఖ నటుడు సుశాంత్ ఎ చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆల్‌పెట్స్ వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ జస్టిన్ కోర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహ-వ్యవస్థాపకులు ఎ.అరుణ్ కుమార్, ఎం.తిరుమల్లై తోకలని వారు మాట్లాడుతూ ఈ కేంద్రంలో సంప్రదింపులు, టీకాలు, రోగ నిర్ధారణ, చికిత్స, శస్త్రచికిత్స, ఫార్మసీ, అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇప్పటికే 15 వేల మందికి పైగా పెంపుడు జంతువుల యజమానులకు సేవలందించిన ఆల్‌పెట్స్, రాబోయే 12 నెలల్లో దక్షిణ భారత దేశంలో మరో 10 క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా బహుళ-నగర పశువైద్య ఆరోగ్య సంరక్షణ నెట్‌వర్క్‌ను నిర్మించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు.

## మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ నూతన కమిటీని ప్రకటించిన పిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర చైర్మన్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర ) : గత కొన్నిరోజుల క్రితం ప్రకటించిన జిల్లా ఎస్సి సెల్ కమిటీని రద్దు చేస్తూ,తాజాగా నూతన కమిటీని ఎన్నుకున్నారని, మంచిర్యాల ఎమ్మెల్యే శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సిఫార్సు మేరకు జిల్లా అధ్యక్షులు మినహా మిగతా కమిటీని పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కొంగల నవీన్, కుంటాల శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శులు అడ్లూరి తిరుపతి,చిలుక మల్లేష్ ,మహంతి రంజిత్, జిల్లా కార్యదర్శులు బత్తుల వెంకటస్వామి, ఆర్లకొండ నరేష్ , గజ్జెల్లి దయాకర్, శాతరాజు రమేష్, చిప్పకుర్తి లచ్చయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శులు లంకా భార్గవ్, ఆవునూరి రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మడిపెల్లి స్వామి, సోషల్ మీడియా ఇంఛార్జి సిర్రా దివాకర్ మరియు దండేపల్లి మండల అధ్యక్షులు ఆరెపల్లి రమేష్, లక్సెట్టిపేట్ మండల అధ్యక్షులు లింగంపల్లి వెంకటేశం, లక్సెట్టిపేట్ టౌన్ అధ్యక్షులు గుత్తికొండ శ్రీధర్, మంచిర్యాల అధ్యక్షులు పత్తి తిరుపతి, హాజీపూర్ మండల అధ్యక్షులు, జాడి విజయ్, నస్పూర్ అధ్యక్షులు పందుగ శ్రీనివాస్ లను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నూతన ఎస్సీ సెల్ కమిటీ సభ్యులందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఒకే వేదిక పై 14 రాష్ట్రాల చేనేత కళా వైభవం

**-- ఇండియన్ సిల్క్ గ్యాలరీ ని ప్రారంభించిన గుండు సుధారాణి**



హనుమకొండ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ):భారతీయ వస్త్ర సంప్రదాయం, కళాత్మకతకు ప్రతీకగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిలుస్తుందని, 14 రాష్ట్రాల హస్తకళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఇది సరైన వేదిక అని కుడా చైర్మన్ గుండు సుధారాణి అన్నారు. హన్మకొండ హంటర్ రోడ్డు లోని అలకానంద కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషా దయాకర్ రావు తో కలిసి గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ చేనేత, పట్టు వస్త్ర సంపదకు పుట్టినిల్లుగా నిలిచిందని, దేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన కాటన్, పట్టు వస్త్ర సంప్రదాల విశిష్టత ఉండటం భారతీయ నేత కళాకారుల అపూర్వ నైపుణ్యానికి, మన సంస్కృతి వైభవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి చీర వెనుక నేతన్నల శ్రమ, కళాత్మకత, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం దాగి ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఉప్పాడ, ధర్మవరం పట్టు చీరలు, తమిళనాడులోని కాంచీపురం పట్టు, కర్ణాటకలోని మైసూర్ సిల్క్, తెలంగాణలోని గద్వాల్, పోచంపల్లి ఇక్కత్, పశ్చిమ బెంగాల్‌లోని బాలుచరి, తాంతి సిల్క్, ఒడిశాలోని సంభల్పురి ఇక్కత్, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి బెనారసీ సిల్క్ వంటి దేశంలోని ప్రసిద్ధ చేనేత, పట్టు వస్త్రాలు భారతీయ నేత కళా వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. ఈ అరుదైన,నాణ్యమైన వస్త్రాలను ఒకే వేదికపై నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ధృవీకరించిన సిల్క్ మార్క్ కలిగిన ఉత్పత్తులను మాత్రమే ప్రదర్శనలో విక్రయించడం వినియోగదారులకు నాణ్యతపై మరింత విశ్వాసాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లకుండానే భారతీయ పట్టు, చేనేత వైవిధ్యాన్ని ఒకేచోట వీక్షించి, తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ఈ ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని గుండు సుధారాణి తెలిపారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఈ నెల 24వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు 5 రోజుల పాటు అలరిస్తుందని ఎక్స్‌పో నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. చందేరి, మహేశ్వరి, కోట, రాజ్‌కోట్ పటోలా ఇలా వివిధ ప్రాంతాల ప్రత్యేక డిజైన్ల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ప్రజలకు అందుబాటులో ఉంటుందని, కుటుంబ సమేతంగా వచ్చి భారతీయ చేనేత, పట్టు వస్త్రాల వైవిధ్యాన్ని వీక్షించి నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన పట్టు చీరలు, చేనేత వస్త్రాలు, డ్రెస్సు మెటీరియల్స్, తదితర ఉత్పత్తులు విస్తృతంగా ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. అన్ని వస్త్రాలను నేరుగా నేత కళాకారులు, సహకార సంఘాలు, ప్రామాణిక తయారీదారులే ప్రదర్శిస్తుండటం వల్ల నాణ్యతతో పాటు సరసమైన ధరల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారులు స్వచ్ఛమైన పట్టు వస్త్రాలను నమ్మకంగా కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం టీపీసీసీ చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం నాయకుడు వైద్యం రాజగోపాల్, ఎర్రబెల్లి కమల తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనాలు ప్రశాంతం - కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో జరుగుతున్నా గణేష్ నిమజ్జన తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లను, భద్రతా చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో సుమారు 700కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చెరువు వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసేందుకు అవసరమైన పెద్ద క్రేన్లను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చెరువు వద్ద వాటర్‌ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేసి, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుంటూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ వైర్లు గణేష్ విగ్రహాలకు తగలకుండా తగిన ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.సెప్టెంబర్ 24, అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, చెరువు వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. విగ్రహాలు వరుస క్రమంలో నిమజ్జనం జరిగేలా తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భక్తులు, ప్రజలు నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.





# జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎస్.ఆర్.ఎన్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 29, 30 తేదీల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, శిక్షణలో చర్చించనున్న అంశాలు, జర్నలిస్టులకు అందించనున్న శిక్షణ వివరాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు మీడియా అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు, ఛైర్మన్ ఓఎస్డీ రహ్మాన్, మేనేజర్ శైలేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, అవసరాలను కూడా మీడియా అకాడమీ కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించే శిక్షణలో సుమారు ఎనిమిది ముఖ్యమైన అంశాలపై నిపుణులతో జర్నలిస్టులకు శిక్షణ అందించనున్నారు. సమాచార హక్కు చట్టం, తప్పొప్పుల పరిశీలన, నేర వార్తల కవరేజ్, వార్తా కథనాల రూపకల్పన, వార్తా సేకరణ, వార్తల ప్రాధాన్యత నిర్ణయం, వాస్తవ నిర్ధారణ, మీడియా చట్టాలునైతిక నియమాలు, జర్నలిజంలో పాటించాల్సిన వృత్తిపరమైన ప్రమాణాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. జర్నలిజం రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మీడియా అకాడమీ కార్యదర్శి తెలిపారు. శిక్షణ ద్వారా పొందే జ్ఞానం జర్నలిస్టులు తమ రోజువారీ వృత్తి విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు రోజున నిర్వహించనున్న ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మీడియా అకాడమీ కార్యదర్శి ఆహ్వానించారు. ముగింపు కార్యక్రమానికి హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడేందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మీడియా అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి - కలెక్టర్



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీటిపై క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలిచెల్లుబాటు అయ్యే లైసెన్స్/రిజిస్ట్రేషన్ తప్పనిసరి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్కామారెడ్డి కలెక్టరేట్ ఛాంబర్ లో బుధవారం జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ నిర్వహణలో జరిగిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత తాగునీటి లభ్యతను నిర్ధారించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార నిల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని అన్ని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత నిబంధనలు పాటించని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆహార భద్రతకు సంబంధించిన తనిఖీలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ప్రసన్న, డిపిఓ మురళి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## 25న పెద్ద చింత రేవులలో ఉడిపి పలిమార్ పీఠాధిపతులచే శ్రీ అనంత పద్మనాభ స్వామి వ్రతం

**- సెప్టెంబర్ 26న పౌర్ణమి వేడుకలు....**

**చాతుర్మాస్యం ముగింపు**



ధరూర్ సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గల పెద్ద చింత రేవుల అన్నప్రసాద ట్రస్ట్ సత్రంలో ఈనెల 25న శుక్రవారం నాడు ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యా దిశ తీర్థ శ్రీపాదులు వారు శ్రీ 1008 శ్రీ విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారిచే భగవాన్ శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. స్వామీజీలచే ఆంజనేయ స్వామి వారికి అభిషేక పూజలు, మూల రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా శనివారం నాడు పీఠాధిపతులచే పౌర్ణమి వేడుకలు ఉడిపి వేద పండితుల వారిచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం వరకు చాతుర్మాస దీక్షలు ముగింపు కార్యక్రమం ఉన్నదని తెలిపారు. పాల్గొన్న భక్తులందరికీ పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ వారిచే అన్నప్రసాద పంపిణీ ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959251123,9949789241,9440770020.ల లో సంప్రదించాలన్నారు. ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## కామారెడ్డి రైల్వే స్టేషన్ గణనాథునికి కొబ్బరికాయ , ప్రత్యేక పూజలు - కలెక్టర్, ఎస్పీ,



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24(డివిజన్ఆంధ్ర) : కామారెడ్డి పట్టణంలో బుధవారం నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద గణనాథునికి కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించే కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, ప్రజలు శాంతియుతంగా పాల్గొని పోలీసు, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అధికారులు, పోలీసు సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హార్వెస్టింగ్ పాండ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మీశన్‌పల్లి గ్రామంలో నిర్మించిన హార్వెస్టింగ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హార్వెస్టింగ్ పాండ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పాండ్ వినియోగం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నీటి సంరక్షణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పాండ్ వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉందా అని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో పనిచేసే వారికి అవసరమైన తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా హార్వెస్టింగ్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణకు చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రోడ్డ ప్రభాకర్, డీఆర్‌డీఓ దామోదర్, ఎంపీడీవో తహీరా బేగమ్, తహసీల్దార్ ప్రేమ్, మండల స్పెషల్ ఆఫీసర్ నరసయ్య, సర్పంచ్ ఉప సర్పంచ్ ఏపీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలు పారదర్శకంగా ఉండాలి

**-మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లలో జాప్యం లేకుండా చర్యలు**

**-సరిగా డేటా సేకరించని కేంద్రాలకు నోటీసులు.. అవసరమైతే సేవల రద్దు**

**-క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ముమ్మరం చేయాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : ఆధార్ సేవలను మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆధార్ నూతన నమోదులు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్లు, పెండింగ్ దరఖాస్తులు, శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఆధార్ నూతన నమోదులు, పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ నమోదులు, అప్‌డేట్లను వేగవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ఆధార్ సేవలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలని స్పష్టం చేశారు. డేటాను సక్రమంగా సేకరించని కేంద్రాలు, నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే డేటా కలెక్షన్ రద్దు వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్‌ను ముమ్మరం చేసి, బయోమెట్రిక్ వివరాలు, సరైన డేటాను ఎప్పటికప్పుడు సమర్పించేలా చూడాలన్నారు. నిబంధనలు పాటించని వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ, పోస్టల్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఆధార్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, ఈ డి యం. కవిత, సంబంధిత, జిల్లా అధికారులు, పోస్టల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మూసీ భూసేకరణపై రైతులతో మేడిపల్లి తహసీల్దార్ చర్చలు

**- ఎకరాకు 1,400 గజాల పరిహారంపై అధికారుల ప్రతిపాదన**

**- బఫర్ పరిధిలో 800 గజాలా... టీడీఆర్ ఇచ్చే అంశంపై పరిశీలన**

**- మేడిపల్లి తహసీల్దారు వెంకట నర్సింహారెడ్డి**

**- 1,600 గజాలు ఇవ్వాలని రైతుల డిమాండ్**



బోడుప్పల్,సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మూసీ ప్రక్షాళన, అభివృద్ధి పనుల కోసం భూసేకరణకు సంబంధించి అధికారులు రైతులతో చర్చలు ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని గ్రీన్‌ల్యాండ్ కాలనీ నుంచి సంఘం హోటల్ వరకు ఉన్న వ్యవసాయ భూముల యజమానులతో మేడిపల్లి తహసీల్దారు కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. తహసీల్దారు వెంకట నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సుమారు 120 ఎకరాల భూమికి సంబంధించి చర్చలు జరిగినట్లు సమాచారం. సమావేశానికి సుమారు 30 మంది రైతులు, భూయజమానులు హాజరయ్యారు. భూసేకరణకు సంబంధించి పట్టా భూములకు ఎకరాకు 1,400 గజాల చొప్పున పరిహారం అందించే ప్రతిపాదనను అధికారులు రైతుల ముందు ఉంచినట్లు తెలిసింది. బఫర్ పరిధిలోని భూములకు ఎకరాకు 800 గజాలు లేదా టీడీఆర్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించినట్లు సమాచారం. అయితే భూముల ప్రస్తుత విలువ, భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎకరాకు 1,600 గజాలు ఇవ్వాలని రైతులు కోరినట్లు తెలిసింది. మూసీ అభివృద్ధి పనుల కోసం భూములు కోల్పోతున్నందున న్యాయమైన పరిహారం అందించాలని వారు అధికారులను కోరారు. భూసేకరణ మార్గదర్శకాలు, బఫర్ పరిధి, పరిహారం విధానంపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. రైతుల అభ్యంతరాలు, డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపినట్లు తెలిసింది. పరిహారం విషయంలో రైతులు, అధికారుల మధ్య మరిన్ని చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన తర్వాతే భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో మేడిపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.


# గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర) : గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కొరకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ సహకారంతో పునరుద్ధరించిన జిల్లాలోని కాగజ్ నగర్ మండలం లైంగుడ గ్రామపంచాయతీ పరిధిలోని మారేపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉజ్వల్ కుమార్, సమారిటన్స్ ఫర్ ది నేషన్ వ్యవస్థాపకుడు పి.రామ్ కుమార్, సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల పరిపాలనతో పాటు లైంగుడ గ్రామ పంచాయతీ చేసిన అభ్యర్థన మేరకు సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ సుమారు 2.20 లక్షల రూపాయల వ్యయంతో పాఠశాల పునరుద్ధరణ పనులకు సహకారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ పునరుద్ధరణ ద్వారా పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన, సౌకర్యవంతమైన అభ్యసన వాతావరణం కల్పించడం జరిగిందని తెలిపారు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఎ పి ఓ, సంబంధిత అధికారులు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లూర్ మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కోనప్ప



పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర): పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామ మాజీ సర్పంచ్ దుర్గం రాజన్న అనారోగ్యంతో మెడి లైఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజన్న ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్సపై వివరాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాజన్నతో కొద్దిసేపు మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనారోగ్య పరిస్థితుల్లో మనోధైర్యంతో ఉండటం ముఖ్యమని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాజన్న ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటామని తెలిపారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కోనేరు కోనప్ప పరామర్శించడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం..

**- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదన కలెక్టర్ నర్సింగరావు**




గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగ జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆరోగ్య పరిక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ నర్సింగ్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. సంధ్యా కిరణ్మయి గురువారం భీమ్‌నగర్‌లోని పీఎం శ్రీ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఘనంగ ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 43,419 మంది విద్యార్థులకు దశలవారిగ సమగ్ర ఆరోగ్య పరిక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆరోగ్య పరిక్షల్లో విద్యార్థుల ఎత్తు, బరువు, బిఎంఐ, రక్తపోటు, పల్స్, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ తదితర పరిక్షలతో పాటు కంటి, చెవిముక్కుగొంతు, గుండె, చర్మం, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థులకు అవసరమైన చికిత్స, తదుపరి పరిక్షలు, రిఫరల్ సేవలు అందించనున్నారు. వైద్య పరిక్షల వివరాలను నమోదు చేస్తూ ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగ హెల్త్ ప్రొఫైల్ కార్డు రూపొందించనున్నారు. ఇందులో విద్యార్థి ఆరోగ్య చరిత్ర, గుర్తించిన ఆరోగ్య సమస్యలు, అందించిన వైద్య సేవలు తదితర వివరాలను నమోదు చేస్తారు. తద్వార విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది. బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రుతుస్రావం, ఇతర ఆరోగ్య అంశాలను కూడ నమోదు చేయనున్నారు. అవసరమైన సందర్భాల్లో ఆరోగ్య అవగాహన, వైద్య సలహాలు, తదుపరి వైద్య సేవలు అందించనున్నారు. అర్బీఎస్కే,పిఎచ్సీ. వైద్య బృందాల సహకారంతో మండలాల వారిగ ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి పాఠశాలలను సందర్శిస్తూ ఆరోగ్య పరిక్షలు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగ నిర్వహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. ప్రసూన రాణి, డా. రాజు, డా. అస్గర్ అలీ, వైద్యాధికారులు డా. శరణ్య, డా. ప్రియాంక, నేత్ర వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, సూపర్వైజర్లు, ఏఎన్ఎం.లు, ఆశా కార్యకర్తలు, జిల్లా కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, తిరుమల్ రెడ్డి, నరేందర్ బాబు, నరసయ్య, హీర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అందుబాటులో వసతి గృహ ఏర్పాటు

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర ) : విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం షెడ్యూల్ కులముల సంక్షేమ వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్, చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తివారి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ షెడ్యూల్ కులముల విద్యార్థుల సంక్షేమం దిశగా 1 కోటి 81 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, 1 కోటి 50 లక్షల రూపాయలతో జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, కోటపల్లి మండలంలో సైతం షెడ్యూల్ కులముల వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మందమర్రి ప్రాంతంలోని భూములలో సింగరేణి సంస్థ సమన్వయంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రామకృష్ణాపూర్ సమీప ప్రాంతాల ప్రజల కోసం మందమర్రి మండల కేంద్రంలో 50 పడకలతో ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఆర్.కె. ఓ.సి.లో నూతన గని ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, మండల కేంద్రంలోని సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ కేంద్రంలో జర్మనీ భాష నేర్పించి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 70 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్ తో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, విద్యా బోధన, పరిసరాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


# వరి ధాన్యం నిల్వకు ప్రైవేట్ ఫంక్షన్ హాల్ పరిశీలన



మా రెడ్డి బ్యూరో సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి డివిజన్‌లోని లింగంపేట మండలంలోని వరి ధాన్యం నిల్వ కోసం గోదాం తాత్కాలిక నిల్వ కేంద్రంగా వినియోగించేందుకు అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్‌లో అందుబాటులో ఉన్న స్థల విస్తీర్ణం, నేల పరిస్థితి, రహదారి సౌకర్యం, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉన్న అవకాశాలు, వెంటిలేషన్ తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వరి ధాన్యం నిల్వకు ప్రాంగణం ఎంతవరకు అనుకూలంగా ఉంటుందనే విషయంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం సేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన నిల్వ సామర్థ్యాన్ని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రాంగణంలో నిల్వ చేయగల ధాన్యం పరిమాణాన్ని అంచనా వేసి, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పద్ధతిలో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు, నిల్వ సామర్థ్యం, రవాణా సౌకర్యాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర సాధ్యాసాధ్యాల నివేదికను సిద్ధం చేసి తదుపరి చర్యల కోసం సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, సివిల్ సప్లైస్ అధికారి వెంకటేష్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీవో, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ ఇరిగేషన్, ఏఈ ఆర్‌అండ్‌బీ, ఏఈ మిషన్ భగీరథ, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పంచాయతీ కార్యదర్శి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24,(విజన్ ఆంధ్ర ) : ఓటరు జాబితా సమగ్ర సవరణ - 2026 లో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధించి ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ లతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు, మరణించిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించి అవసరమైన సవరణలు చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాలను పరిశీలించి, అభ్యంతరాలు/ సవరణలు ఉంటే నిర్ణీత గడువులో సంబంధిత ఎన్నికల అధికారులకు తెలియజేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం సవరించిన కార్యాచరణను రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టిలో ఉంచుకుని నిర్ణీత గడువులోగా ప్రక్రియను వేగవంతంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు, చిరునామా మార్పులు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ నమోదు తదితర అంశాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పార్టీల తరఫున బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్-2026 ప్రక్రియలో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారుల సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టు కు నీళ్లు విడుదలకు కృషి..

**- ఎమ్మెల్యే ని సన్మానించిన రైతులు, నాయకులు**



గద్వాల సెప్టెంబర్ 24( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డి. కె. శివ కుమార్ ని ఒప్పించి తెలంగాణ రాష్ట్రం జూరాల ప్రాజెక్టుకు నీళ్లు విడుదల చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి గద్వాల మండలం రైతులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, నాయకులు శ్రీరాములు రెడ్డి, రామాంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లుగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు పరిష్కారం



కాగజ్‌నగర్, సెప్టెంబ ర్ 24 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీలో ఏళ్ల తరబడి కిందకు వేలాడుతూ ప్రజలకు ఇబ్బందిగా, ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ వసాకే పుల్లబాయి చొరవతో విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయించారు. చాలాకాలంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాకపోకలు సాగించే ప్రజలకు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉండేది. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ వసాకే పుల్లబాయి విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామానికి చేరుకుని ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. అనంతరం మరమ్మతు పనులు చేపట్టి తీగలను సరిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ చొరవ చూపడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వసాకే పుల్లబాయి మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో విద్యుత్ సంబంధిత సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ తీగలను సరిచేసిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆనంద్‌నగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

**- పాల్గొన్న కాంగ్రెస్ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్**



బోడుప్పల్,సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో గణేష్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కాలనీ వాసులు భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ నిమజ్జన శోభాయాత్రలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి ఊరేగింపులో భాగస్వాములయ్యారు. భక్తుల సందడి, డప్పుల మోత, గులాల్ చల్లుతూ సాగిన నాట్యాలు, గణపతి నామస్మరణలతో కాలనీ వీధులన్నీ మారుమోగాయి.

ఐక్యతకు ప్రతీక గణేష్ ఉత్సవాలు:

ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు కాలనీ ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా, ప్రశాంత వాతావరణంలో ఈ వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు,మహిళలు, యువతతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు బతక శ్రీనివాస్ యాదవ్,తలారి యాదగిరి యాదవ్,కావాలి శ్రీనివాస్, మరాఠీ సంపత్, జక్కుల శ్రీశైలం, స్థానిక నాయకులు మరియు కాలనీ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి

**- సహకరించిన జీహెచ్ఎంసీ పోలీసు సిబ్బందికి కాలనీ కమిటీ కృతజ్ఞతలు**





హైదరాబాద్ సెప్టెంబర్ 24 విజన్ ఆంధ్ర : మౌలాలి డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గణేష్ మండపంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, అనంతరం నిర్వహించిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగిసింది. నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బందికి కాలనీ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది, ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాధాకిషన్, ఉపాధ్యక్షులు నాందేవ్ షిండే, శ్రీనివాస్ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ శ్రీధర్ తూర్పుతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు

# చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్ గణనాథుడి లడ్డూ రూ.3.69 లక్షలు

**- లక్ష్మీహారం రూ.1.54 లక్షలు.. పట్టువస్త్రాలు రూ.38 వేలకు కైవసం**



బోడుప్పల్,సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లోని శ్రీ సాయి విరాధ్య గేటెడ్ కమ్యూనిటీలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో కమ్యూనిటీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వేలం పాటలో గణపతి లడ్డూను పెరుమాళ్లనిర్మల దంపతులు రూ. 3,69,000కు కైవసం చేసుకున్నారు. లక్ష్మీహారాన్ని నర్సయ్యఅనిత దంపతులు రూ. 1,54,809కు, పట్టువస్త్రాలను విద్యానాథ్‌శ్రీదేవి దంపతులు రూ. 38,000కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రతి ఏడాది కమ్యూనిటీ వాసులందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో పాటు,వేలం పాటలో కమ్యూనిటీ వాసులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.వచ్చే ఏడాది కూడా మరింత ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ సంజీవ్‌కుమార్,కార్యదర్శి అశోక్, కోశాధికారి ప్రవీణ్,ఉపాధ్యక్షుడు కృష్ణమాచార్యులు,డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కబడ్డీలో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి.


**- కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ కార్తీక్**



నారాయణపేట , సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట, సెప్టెంబర్ 24 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచి నారాయణపేట జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ కార్తీక్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 5 రోజు కబడ్డీ క్రీడా క్యాంపులో క్రీడాకారులతో కలిసి మాట్లాడారు. కబడ్డీ క్యాంపును సద్వినియోగం చేసుకొని తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలోనే మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కబడ్డీ పోటీలు దేహదారుఢ్యానికి దోహదపడుతుందని నారాయణపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వర్ రెడ్డి, వెంకటప్ప అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాయినాథ్, బాల్ రాజ్, రామకృష్ణ, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఓవర్‌ఫ్లో పైపు విరిగి.. నీరు వృథా!

**- పట్టించుకోని అధికారులు.. పారుపల్లి గ్రామస్తుల ఆవేదన**



ముత్తారం,సెప్టెంబరు 24 (విజన్ ఆంధ్ర): ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ ఓవర్‌ఫ్లో పైపు విరిగిపోవడంతో గత కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది.పైపు దెబ్బతిన్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాటర్ ట్యాంక్ నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతున్న సమయంలో విరిగిన పైపు నుంచి పెద్ద మొత్తంలో నీరు బయటకు వచ్చి వృథాగా పోతుందని స్థానికులు తెలిపారు.ఇప్పటికే పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్న తరుణంలో విలువైన నీరు ఇలా వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విరిగిన ఓవర్‌ఫ్లో పైపును వెంటనే మరమ్మతు చేసి,నీటి వృథాను అరికట్టాలని పారుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.


# అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు-2026 పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు




గద్వాల సెప్టెంబర్ 24 విజన్ ఆంధ్ర బ్యూరో) : అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు-2026ను పురస్కరించుకొని గురువారం ఐడీఓసీలోని మీటింగ్ హాల్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు ఆవిష్కరించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, గౌరవం, హక్కులు, సంక్షేమం, సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వయోవృద్ధులకు ఆరోగ్య శిబిరాలు, సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, నిర్లక్ష్య నివారణపై అవగాహన కార్యక్రమాలతో పాటు యోగా, ప్రాణాయామం, వాక్థాన్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వయోవృద్ధులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రోత్సహించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు.అలాగే, సెప్టెంబర్ 25న జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలు సులభతరం అందేలా చూడాలి

**- బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లలో జాప్యం వద్దు**
**- లోపాలుంటే అన్నీ ఒకేసారి చెప్పాలి**
**- మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి**
**- టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం**



మేడ్చల్ జిల్లా,సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను సత్వరమే అందించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల్లో ఏవైనా లోపాలు ఉంటే వాటన్నింటినీ ఒకేసారి దరఖాస్తుదారులకు తెలియజేయాలని, ఒక్కోసారి ఒక్కో షార్ట్‌ఫాల్ చెబుతూ జాప్యం చేయొద్దని స్పష్టం చేశారు. పెండింగ్ ఫైళ్లను నిర్ణీత సమయంలో పరిష్కరించడం ద్వారా ప్రజలకు పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా మున్సిపల్ సేవలు అందించాలని సూచించారు.ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో జోన్‌ల వారీగా ఏసీపీల వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తులను కమిషనర్ పరిశీలించారు. సీసీపీ, అదనపు సీసీపీల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు.ఎక్కువ రోజులుగా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. నిర్ణీత సమయంలో పరిశీలించి తదుపరి స్థాయికి పంపాలని ఆదేశించారు.దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం అందిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

**ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి:**

ఫీజు చెల్లింపునకు సమాచారం అందిన దరఖాస్తుదారులు నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఫీజు చెల్లించిన దరఖాస్తులను తదుపరి ప్రక్రియలో ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్‌కుమార్,ఎల్ఏఓ సరిత, ఏసీపీలు నరేష్,భాగ్యలక్ష్మి,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేట జిల్లా పి ఆర్ టి యు అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక




నారాయణపేట , సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్ లో జరిగినపిఆర్టియుటిఎస్ జిల్లా సర్వసభ్య కౌన్సిల్ సమావేశంలో నారాయణ పేట జిల్లా అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకట్ రెడ్డి గౌరవ అధ్యక్షు లుగా ఏం రఘువీర్ ఏకగ్రీ వంగాఎన్నికయ్యారు.అలాగే జిల్లా కార్యవర్గంలో 20 మంది సభ్యులు ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి ఆర్టి యు టి ఎస్ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికల అధికారులుగా వికారాబాద్ జిల్లా అధ్య క్షులు కడియాల చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ పరిశీలకులుగా భీమప్ప, యాదయ్య హాజ రు అయ్యారు.ఈ కార్య క్రమంలో పాల్గొన్న జిల్లా లోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు కౌన్సిల్ సభ్యులు గత రెండు సంవత్సరాల కాలంలోయాద్గిర్ జనార్దన్ రెడ్డి పల్లె వెంకట్ రెడ్డి సంఘ నిర్మాణం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయ డం వలన వారిని మరల 2026- 28 సంవత్సరాలకు గాను ఏకగ్రీవంగా ఎన్నుకోవ డం జరిగిందనీ పేర్కొన్నా రు.నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వము దసరాకు కేవ లం రెండు డిఏలు ఇవ్వడా న్ని అసంతృప్తి వ్యక్తం చేశా రు. ప్రభుత్వము వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు . అదే విధంగా రాబోవు రెండు సంవత్సరాల కాలంలో 317 జీవో పరిష్కారం మీద పోరాటం చేస్తామని తీర్మా నం చేశారు. కాంట్రిబ్యూటర్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్ద మొత్తం లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని,అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నారాయణపేట జిల్లాకు విద్యా వాలంటీర్లను తీసు కురావడానికి త్వరితగతిన కార్యాచరణ జరుగుతుం దని పేర్కొన్నారు. ఉపాధ్యా యులు పాఠశాలలో నాణ్య మైన విద్యను అందించుట కు కృషి చేయాలని సంఘ ము ద్వారా సమస్యల పరి ష్కారం కోసము పనిచేస్తా మని తెలిపారు . ఈ సంద ర్భంగా పలు తీర్మానాలను చేయడం జరిగింది . జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జనర్దన్ రెడ్డి గత 24 సంవ త్సరాలుగా సంఘంలో అంకితభావంతో పనిచేస్తూ సంఘము కోసము ఉపా ధ్యాయుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తూ కృషి చేస్తున్నారని రాష్ట్ర సంఘ ప్రధాన కార్య దర్శి సుంకరి బిక్షం గౌడ్ పేర్కొంటూ ఇలాంటి నాయ కుడిని ఏకగ్రీవంగా ఎన్నుకో వడం శుభసూచకమని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యులకు అభినందనలుతెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పి. నర సింహారెడ్డి,తాజా మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు తిరుపతి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శు లు సత్యనారాయణ రెడ్డి రమేష్ ఎం జనార్దన్ గోవ ర్ధన్ నరసింహారెడ్డి సూర్య ప్రకాష్ రాజు నాయక్ శ్రీకాం త్ రాజేందర్రెడ్డి గోపాల్ రెడ్డి బాబు వెంకటేష్ హరీష్ శేఖర్ అనిల్ కుమార్ వాణి శ్రీ జరుద్దీన్ శ్రీనివాసరావు శ్రీనివాసులు నవీన్ కుమార్ ముస్తఫా కిష్టయ్య లక్ష్మణ్ వెంకటేష్ , భీమేష్ ప్రకాష్ గౌడ్ నరసింహులు తదిత రులు పాల్గొన్నారు.

# జిల్లా పి ఆర్ టి యు నూతన కార్యవర్గం ఎన్నిక



నారాయణపేట , సెప్టెంబర్ 24( విజన్ ఆంధ్ర) : 2026 -28 సంవత్స రాలకు గాను పి ఆర్టీయు టి ఎస్ నారాయణపేట జిల్లా నూతన కార్యవర్గన్నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు. యాద్గిర్ జనార్దన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి.పల్లె వెంకట్ రెడ్డి , జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రఘువీర్ ,జిల్లా అసోసి యేట్ అధ్యక్షులు.పళ్ళ అనిల్ కుమార్ ,ఎస్. విశ్వ నాథు, సి.రామ్ కిరణ్ మహిళా అసోసియేట్ అధ్యక్షులు పి.మాధవి, సంధ్య ,జిల్లాఉపాధ్యక్షులు. కె.శ్రీనివాసు,బి.భాస్కర్, ఎం.అర్. అజయ్,ఎస్. అరవింద్ కుమార్, కె.శ్రీనివా సులుఎన్నికయ్యారు.అలాగే మహిళా ఉపాధ్యక్షులు చంద్రకళ ,సుభాషిణి కార్యదర్శులు బాలకృష్ణ ఎం.శ్రీనివాస్ లు ,పి రాఘ వేంద్ర ,అనంతయ్య ,వీరబాద్రప్ప, మహిళా కార్యదర్శులు సునీత నామాజీ ,పర్వీన్ బేగం ఎన్నికయ్యారు.

# సెప్టెంబర్ 26న జాబ్ మేళా

**- జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి. ప్రశాంతి**

గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి జి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 11;00 నుండి మధ్యాహ్నం 2;00 వరకు ఐ.డి.ఒ.సి. ఏఫ్-30/1, కలెక్టరేట్ నందు జాబ్ మేళా నిర్వహించబడును. 1835 సంవత్సరాల వయస్సు కలిగిన 10వ తరగతి , ఇంటర్, డిగ్రీ, బి. ఫార్మసీ,ఎమ్. ఫార్మసీ, పిసిఐ అర్హతలు ఉన్న అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం గద్వాల, ఐజ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, బెంగళూరులోని అపోలో ఫార్మసీ, పుష్పల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, మెడ్‌ప్లస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ యల్.ఎన్. గ్రూప్ ద్వారా ఫోక్స్కాన్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## అయిజ మండల నూతన ఎంపిడీవో.గా గద్దం కృష్ణయ్య



అయిజ సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల ఎంపిడీవోగా గద్దం కృష్ణయ్య బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా, కోహెడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై అయిజకు వచ్చారు. ఈ రోజు ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**-చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
**-ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి**
**- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ బ్యూరోచీఫ్ సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర ) : హనుమకొండ కలెక్టరేట్ నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరిస్థితులు, గురు, శుక్రవారాలపాటు వర్షాలకు హై అలెర్ట్ ఉన్న నేపథ్యంలో అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాల వివరాలను తెలుసుకుని, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లాలోని వేలేరు , ఆత్మకూర్ మండలాల్లో బుధవారం కురిసిన వర్షంతో అధిక వర్షపాతం నమోదైందన్నారు. నేడు, రేపు (గురువారం, శుక్రవారం)కూడా ఆకస్మికంగా భారీ వర్షపాతం నమోదైతే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలను అధికారులు చేపట్టాలన్నారు. చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేర నీరు ఉందో సాగునీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపాతం పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు.భారీ వర్షాల సమయంలో అధికారులు తమ పరిధిలో స్థానికంగానే అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రస్తుతం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ప్రధాన నాలాల వద్ద వరద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలాగే అన్నీ మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారులు, వాగులు, వంకలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా వర్షాల కారణంగా జరిగిన నష్టం పై వెంటనే వివరాల నివేదికను అందజేయాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురిసినప్పుడు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ గూగుల్ మీట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు,భవనాలు శాఖ ఈఈ దేవిక చౌహాన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వినియోగిస్తేనే భవిష్యత్తు తరాల మనుగడ

**- విబిజి రామ్ జీలో జల సంరక్షణ పనులను గుర్తించాలి**
**- ఇంకుడు గుంతలు, పామ్ కుంటల నిర్మాణంతో జల సంరక్షణ**
**- బిందు సేద్యంతో ఆరుతడి పంటల సాగు**
**- ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో ఉత్తమ నీటి నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చిన**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**






గద్వాల సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని ఫలితంగా భవిష్యత్తు తరాల మనుగడ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 20-26వ తేదీ వరకు నిర్వహిస్తున్న తొమ్మిదవ ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ఆహ్వానం అందడంతో గురువారం పాల్గొని జోగులాంబ గద్వాల జిల్లా నీటి నిర్వహణ ఉత్తమ పద్ధతుల ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ప్రజెంటేషన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడం, విబిజి రాంజీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, మత్స్య సంపద అభివృద్ధి వంటి చర్యలను ముఖ్యంగా వివరించారు. విబిజి రాంజీ పథకంలో ఎక్కువగా జల సంరక్షణ పనులను గుర్తించి చేపడితే కరువు కాటకాలను అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు.నీటి సంరక్షణ, వ్యవసాయ వైవిధ్యీకరణ, భూగర్భ జలాల రీచార్జ్, ప్రజల భాగస్వామ్యంతో జోగులాంబ గద్వాల జిల్లాలో అమలు చేస్తున్న సమగ్ర నీటి నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా తెలియజేశారు.గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణంతోపాటు రైతుల పొలాల్లో పంట కుంటల నిర్మాణం, కమ్యూనిటీ సోప్ కిట్స్, ఊట కుంటల నిర్మాణ ఆవశ్యకతను గురించి తెలిపారు. బిందు సేద్యంతో ఆరుతడి పంటల సాగును వివరించి ఫలితంగా కలుపు మొక్కలు పెరగకుండా తక్కువ నీటితోనే పంటలను పండించుకునే మైక్రో ఇరిగేషన్ విధానాలను విస్తృతపరచాల్సిన ఆవశ్యకతను వ్యక్తపరిచారు. సామాజిక అడవుల పెంపకంతో పాటు చెక్ డాముల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెరిగితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలియజేస్తూ వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించడమే కాక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జల సంరక్షణకు కేవలం ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సేవా సంస్థలు, పర్యావరణవేత్తలు, ప్రజల భాగస్వామ్యం కూడా పెద్ద ఎత్తున అవసరమంటుందని పేర్కొన్నారు. జాతీయస్థాయి వేదికపై పాల్గొనీ నీటి వనరుల పెంపుపై ప్రసంగించే అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

# రేషన్ కార్డులు... తర్వాత పింఛన్లు




హైదరాబాద్, సెప్టెంబర్ 24, : తెలంగాణ రాజకీయాల్లో కేవలం రాజకీయంగా విపక్షాలకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా సామాన్య ప్రజలకు పథకాలు విస్తృతంగా అందించి క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పట్టాలెక్కించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్న అర్హులందరికీ అక్టోబర్ నుంచే కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే దసరా పండుగకు ముందే లబ్ధిదారుల చేతుల్లో ఈ పింఛన్ నగదు ఉండేలా చూడాలని అధికారులకు అత్యున్నత స్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ఈ మేరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఆదేశాలు అందాయి. ఎక్కడా చిన్నపాటి జాప్యానికి కూడా తావులేకుండా, అవసరమైతే మండల, గ్రామ స్థాయిల్లో అదనపు సిబ్బందిని యుద్ధప్రాతిపదికన నియమించుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హుడికి పెన్షన్ అందేలా పూర్తి పారదర్శకతతో రికార్డులను సిద్ధం చేయాలని, ఎవరి వద్ద నుంచి ఎలాంటి సిఫార్సులు ఆశించకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేయాలని అధికార వర్గాలు ఆదేశించాయి.సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కొత్త పింఛన్లు మంజూరు కాక, వృద్ధులు, వితంతువులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన దుస్థితిని కాంగ్రెస్ నాయకత్వం గుర్తు చేస్తోంది. ఇప్పుడు అర్హత ఉన్న ఏ ఒక్క ఒంటరి మహిళ లేదా వితంతువు మిగిలిపోకుండా వంద శాతం కవరేజ్ సాధించాలని నిర్ణయించడం ద్వారా.. మహిళా ఓటు బ్యాంకులో కాంగ్రెస్ గ్రాఫ్‌ను అమాంతం పెంచేలా పక్కా గ్రౌండ్ లెవల్ ప్లాన్ సిద్ధమైంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల్లో ప్రభుత్వానికి తిరుగులేని సానుకూలతను తీసుకువస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.గత కొద్ది రోజులుగా అసెంబ్లీ వేదికగా కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా భూ వివాదాలు, ఫామ్‌హౌస్ లీజులు, దానం అనర్హత అంశాలతో విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి.. సమాంతరంగా సంక్షేమ కార్డును ప్రయోగించడం రాజకీయంగా బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే పథకాలు ఆగిపోతాయి అంటూ బీఆర్ఎస్ చేసిన ప్రచారాన్ని తొలుత రేషన్ కార్డుల మంజూరుతో, ఇప్పుడు దసరా కానుకగా కొత్త పెన్షన్ల ప్రకటనతో ప్రభుత్వం పటాపంచలు చేసింది. సంక్షేమ లబ్ధిదారులను నేరుగా తమ వైపు తిప్పుకోవడం ద్వారా. ట బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకును గండికొట్టేలా రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ డబుల్-స్ట్రోక్ రాజకీయ సమీకరణాలను సమూలంగా మార్చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు





హైదరాబాద్, సెప్టెంబర్ 24, : భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు.స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది.కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 1916లో నిజాం కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ భవనం ఇండో-ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలికి, ఆ కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. నిజాం స్టేట్ రైల్వేస్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన ఈ స్టేషన్ అప్పట్లో హైదరాబాద్ నగరానికి కీలక రైల్వే కేంద్రంగా మారింది. కాలక్రమంలో నగరం విస్తరించడంతో కాచిగూడ స్టేషన్ ప్రాధాన్యం కూడా పెరిగింది. దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ చారిత్రక భవనం నేటికీ తన ప్రత్యేక రూపాన్ని నిలుపుకుంది. అందుకే పునరాభివృద్ధిలో పాత హెరిటేజ్ భవనాన్ని పరిరక్షిస్తూ.. దాని చుట్టూ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ప్రాధాన్యంగా మారింది.

# సాకలి గండిని కదిలించే 'కల్వర్ట్' కుట్ర?

- ఓ నేత ప్రయోజనం కోసం హెచ్‌ఎండీఏ అధికారుల తంటాలు!
- నాడు బీఆర్ఎస్ హయాంలో మంత్రి అండతో కలెక్టర్ ఆదేశాలకే తూట్లు.. నేడు కాంగ్రెస్ అధికారంలోనూ అదే తంతు!
- ప్రజల భద్రత పక్కనపెట్టి.. ప్రైవేట్ నిర్మాణానికి పెద్దపీట..?
- అక్రమ నిర్మాణానికి అండగా అధికార యంత్రాంగం?
- కాలువ మళ్లింపు వెనక ఎవరి ఒత్తిడి?
- సాకలోళ్ల గండి మార్పుపై అధికారుల పాత్రపై అనుమానాలు!!
- ఇరిగేషన్ అధికారుల మౌనం ఎందుకు?
- ఉన్నతాధికారులు విచారణ జరపాలి

ప్రభుత్వాలు మారుతున్నా.. గొలుసుకట్టు కాలువల విషయంలో మాత్రం పాత కథే కొనసాగుతోందా? ఒకవైపు ప్రజల భద్రత, మరోవైపు ఓ వాణిజ్య నిర్మాణ ప్రయోజనం.. ఈ రెండింటిలో అధికారులు దేనికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రశ్నలు ఇప్పుడు బోడుప్పల్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. దశాబ్దాలుగా ఉన్న సహజ నీటి ప్రవాహ మార్గాన్ని కాపాడాల్సిన యంత్రాంగమే.. కల్వర్ట్ మార్పు ద్వారా కాలువ గండిని కదిలించేందుకు ప్రయత్నిస్తోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.(మరో కథనంలో పూర్తి వివరాలతో)







మేడ్చల్ జిల్లా/బోడుప్పల్, సెప్టెంబర్ 23 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గొలుసుకట్టు కాలువల పరిరక్షణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సహజ నీటి ప్రవాహ మార్గాన్ని కాపాడాల్సిన అధికారులు ఓ వాణిజ్య భవనం ప్రయోజనాల కోసం కాలువ అలైన్‌మెంట్‌ను మార్చే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచెర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న గొలుసుకట్టు కాలువపై గతంలో అనుమతులు లేకుండా వాణిజ్య భవనం నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ భవనాన్ని బార్ నిర్వహణకు లీజుకు ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కాలువపై నిర్మాణం కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని అప్పటినుంచే ఫిర్యాదులు వస్తున్నాయని సమాచారం.

ప్రస్తుతం రోడ్డు విస్తరణ,కల్వర్టు నిర్మాణం పేరుతో కాలువ గండిని మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది అమలైతే భవిష్యత్తులో వర్షపు నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి దిగువ ప్రాంతాల్లో ముంపు సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఓ వ్యక్తి వాణిజ్య భవనం ప్రయోజనం కోసం సహజ నీటి ప్రవాహ మార్గంలో మార్పులు జరిగాయా? లేక ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సాంకేతిక అవసరాల మేరకే చర్యలు చేపడుతున్నారా? అన్నది అధికారిక విచారణ ద్వారానే తేలాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### భారీ వర్షాలతో వెలుగులోకి సమస్య

రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాల సమయంలో బోడుప్పల్ పరిధిలోని పలు కాలనీలు నీటమునిగిన విషయం తెలిసిందే. గొలుసుకట్టు కాలువలు, సహజ నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు సక్రమంగా దిగువ ప్రాంతాలకు చేరకపోవడమే ప్రధాన కారణాల్లో ఒకటిగా అప్పట్లో గుర్తించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అప్పటి పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సాకలోని గండి పై గల సంబంధిత వాణిజ్య భవనంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు స్థానికులు చెబుతున్నారు.అయితే రాజకీయ జోక్యంతో ఆ చర్యలు నిలిచిపోయాయని ఆరోపిస్తున్నారు.ఈ అంశంపై అధికారిక రికార్డుల ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

### ప్రభుత్వం మారినా.. పరిస్థితి మారదా?

రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఆ ప్రాంతంలో మార్పులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ క్రమంలో భవన యజమాని అధికార పార్టీలో చేరిన తర్వాత మళ్లీ అధికారులపై ఒత్తిళ్లు పెరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో ప్రస్తుత సాకలోని గండి మార్గాన్ని కొనసాగించకుండా పక్కనే కొత్త కల్వర్టు నిర్మించి కాలువ గండిని మూసివేసే దిశగా హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి.దీంతో స్థానికులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.అసలు కాలువ అలైన్‌మెంట్ ఏమిటి,దానిని మార్చేందుకు అధికారిక ప్రతిపాదన ఉందా,కొత్త కల్వర్టుకు ఎవరు అనుమతి ఇచ్చారు.ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నారా,కాలువ గండిని మూసివేస్తే నీటి ప్రవాహం ఎలా కొనసాగుతుంది అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కోరుతున్నారు.

### అలైన్‌మెంట్ మార్పు వెనక ఎవరి ప్రయోజనం..?

సహజ నీటి ప్రవాహ మార్గాల్లో మార్పులు చేపట్టే ముందు వరద ముప్పు, నీటి ప్రవాహ సామర్థ్యం, ప్రజల భద్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం కాలువలు, వాగులు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల పరిధిలో నిర్మాణాలకు ప్రత్యేక పరిమితులు అమలులో ఉన్నాయి. బఫర్ జోన్ నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.అలాగే నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో ఇరిగేషన్, రెవెన్యూ, స్థానిక సంస్థల పాత్ర కీలకం. కాబట్టి కాలువ అలైన్‌మెంట్ మార్పు అంశానికి సంబంధించిన సర్వే మ్యాప్‌లు, సాంకేతిక నివేదికలు, అనుమతులు,ఎన్‌ఓసీలు, సంబంధిత ఫైళ్లను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఫీల్డ్‌లో ఒకటి.. అధికారుల మాటల్లో మరొకలా..?

సాకలొని గండి అలైన్‌మెంట్ మార్పు అంశంపై హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఏఈని సంప్రదించగా అలాంటి మార్పులు ఏమీ లేవని చెప్పినట్లు సమాచారం. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కాలువ మార్గం మార్పునకు సంబంధించిన ప్రయత్నాలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.దీంతో అధికారికంగా ఒక విధంగా, క్షేత్రస్థాయిలో మరో విధంగా వ్యవహారం నడుస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫీల్డ్‌లో జరుగుతున్న పనులు ఏ ప్రణాళికలో భాగమో అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### ఇరిగేషన్ శాఖ మౌనం ఎందుకు?

కాలువలకు సంబంధించిన అంశాల్లో ఇరిగేషన్ శాఖ పాత్ర అత్యంత కీలకం.అయితే ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు సంబంధిత ఇరిగేషన్ ఉన్నతాదికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ వారి నుండి ఎలాంటి స్పందన లేదు.కాలువ సరిహద్దులు,పాత అలైన్‌మెంట్, నీటి ప్రవాహ సామర్థ్యం,కొత్త కల్వర్టు నిర్మాణం వల్ల కలిగే ప్రభావంపై ఇరిగేషన్ శాఖ తన సాంకేతిక అభిప్రాయాన్ని వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

### కాలువ మూసేస్తే మళ్లీ ముంపు తప్పదా?

బోడుప్పల్, చెంగిచెర్ల ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో సహజ నీటి ప్రవాహ మార్గాల పరిరక్షణ మరింత కీలకంగా మారింది. ఇప్పటికే పలుచోట్ల కాలువలు,నాలాలు ఆక్రమణలకు గురైన పరిస్థితుల్లో మిగిలిన ప్రవాహ మార్గాలను కూడా కుదించే చర్యలు జరిగితే వర్షాకాలంలో దిగువ ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొత్తగా ప్రతిపాదిస్తున్న మార్గం ప్రస్తుత నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో మోయగలదా? భారీ వర్షాల సమయంలో బ్యాక్‌వాటర్ సమస్య తలెత్తదా? దిగువ కాలనీలపై ప్రభావం ఏమిటి? వంటి అంశాలపై సమగ్ర సాంకేతిక అధ్యయనం నిర్వహించాలని వారు కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి విచారణ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పాత సర్వే మ్యాప్‌లు, కాలువ అలైన్‌మెంట్, ప్రస్తుత పరిస్థితులు, ప్రతిపాదిత కల్వర్టు నమూనా, అనుమతులు, సంబంధిత ఫైళ్లను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు.


# వర్షాన్ని సైతం లెక్కచేయని భక్తి పారవశ్యం

- నిమజ్జనానికి తరలిన గణనాథులు
- కల్వకుర్తిలో 200కు పైగా వినాయక విగ్రహాల ఊరేగింపు
- కాశీ విశ్వనాథ్ యువసేన లడ్డూ వేలంలో రికార్డు


మూడవసారి లడ్డును కైవసం చేసుకున్న పంజుగుల శివలింగం....


రెండవ లడ్డును కైవసం చేసుకున్న లక్ష్మమ్మ...

కల్వకుర్తి, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : గత తొమ్మిది రోజులుగా భక్తి శ్రద్ధలతో, భజన మండళ్లతో, కోలాహలంగా కొనసాగిన గణేష్ నవరాత్రి ఉత్సవాలకు బుధవారం ఘనంగా ముగింపు పలికారు. కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన దాదాపు 200కు పైగా గణనాథులు నిమజ్జనానికి తరలి వెళ్లారు. తెల్లవారుజాము నుంచే మండపాల వద్ద ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, మహా హారతి కార్యక్రమాలను నిర్వహించిన భక్తులు, అత్యంత భక్తి భావంతో గణపతులను ట్రాక్టర్లు, డీసీఎంలపై ఊరేగింపుగా నిమజ్జన వేదికకు తరలించారు. పట్టణంలో ప్రతి గల్లీలోనూ గణపతి మండపం ఏర్పాటు చేసి భక్తులు తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, అన్నదాన కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా "గణపతి బప్పా మోరియా" నినాదాలతో పట్టణమంతా మారుమోగించారు. యువత సౌండ్స్‌కు అనుగుణంగా నృత్యాలు చేస్తూ, గులాల్ చల్లుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు.పట్టణంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన కాశీ విశ్వనాథ్ యువసేన, శివాజీ యువసేన, వేపచెట్టు యువసేన మండపాల వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా కాశీ విశ్వనాథ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణపతి మండపం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా బౌన్సర్లను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బస్టాండ్‌లోని శివాజీ యువసేన ఆధ్వర్యంలో జరిగిన దేశభక్తి నృత్యాలు, వేపచెట్టు వద్ద జరిగిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.రుద్ర యువసేన ఆధ్వర్యంలో డప్పులతో నిమర్జనం ప్రారంభించారు.


కాశీ విశ్వనాథ్ యువసేన మండపం వద్ద నృత్యం చేస్తున్న బాలిక...

లడ్డూ వేలంలో రికార్డు ధరలు:

ఈ సంవత్సరం లడ్డూ వేలం పాట ఆ యూత్ కు హాట్ టాపిక్‌గా మారింది. కాశీ విశ్వనాథ్ యువసేన గణపతి లడ్డూను పంజుగుల గ్రామానికి చెందిన శివలింగం గత మూడు సంవత్సరాలుగా వరుసగా దక్కించుకోవడం విశేషం. గత సంవత్సరం రూ. 1,90,000 లకు లడ్డూను కైవసం చేసుకున్న శివలింగం, ఈ సంవత్సరం అదనంగా రూ. 15 వేలు పెంచి రూ. 2,05,000 లకు వేలం పాటలో లడ్డూను సొంతం చేసుకున్నారు. ఇది ఈ సంవత్సరం పట్టణంలోనే అత్యధిక ధరగా రికార్డు సృష్టించింది.అలాగే రెండవ లడ్డూను పట్టణానికి చెందిన కార్వంగ లక్ష్మమ్మ రూ. 1,00,000 లకు కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం రూ. 70 వేలకు ఈ లడ్డూను తీసుకున్న ఆమె, ఈ సంవత్సరం అదనంగా రూ. 30 వేలు పెట్టి లక్ష రూపాయలకు దక్కించుకోవడం భక్తి భావానికి నిదర్శనంగా నిలిచింది. లడ్డూను సొంతం చేసుకున్న భక్తులకు నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

### పటిష్ట బందోబస్తు:


బౌన్సర్లతో టీం సభ్యులు....


డాన్స్ చేస్తున్న యువతులు...

నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కల్వకుర్తి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి మండపం వద్ద, నిమజ్జన వేదిక వద్ద పోలీస్ బృందాలు మోహరించాయి. మున్సిపల్ అధికారులు నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. క్రేన్లు, లైటింగ్, ట్రాక్టర్ల సౌకర్యం కల్పించారు. శాంతియుతంగా, భక్తి భావంతో నిమజ్జన కార్యక్రమం పూర్తి కావడంతో అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజుల పాటు పట్టణాన్ని భక్తి శ్రద్ధలతో నింపిన గణనాథులు మళ్లీ వచ్చే ఏడాది రావాలని కోరుకుంటూ భక్తులు వీడ్కోలు పలికారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.